Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

ప్రజాతీర్పు

The people's Vcrdict

తెలుగు జాతీయ దినపత్రిక

ప్రజా TV PRAJA TELEVISION The People's Favour

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541

ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 332 | హైదరాబాద్ | ఆదివారం 18 అక్టోబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOR



దుర్గా మండపంలో తొక్కిసలాట

- కోల్‌కతాలో దుర్ఘటన... 19మంది మృతి
- 25 మందికి గాయాలు
- రాష్ట్రపతి, ప్రధానితోపాటు పలువురి సంతాపం
- ప్రమాదస్థలిలో చెల్లాచెదురుగా పాదరక్షలు

కోల్‌కతా, అక్టోబరు 17 (ప్రజాతీర్పు)

పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని చోర్‌బగాన్ సర్బజనీన్ (సర్వజనీన) దుర్గా మండపంవద్ద శనివారం రాత్రి తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 19 మంది మృతి చెందారు. వారిలో 13 మంది మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. మరో 25 మంది గాయపడ్డారు. వారిని వెంటనే -2వ పేజీలో



పిల్లలకు ఇంటర్నెట్ హక్కును నిరాకరించలేం.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు


- వయసు ఆధారంగా ఆంక్షలు విధించడం సరికాదు
- చిన్నారుల రక్షణకు 'చైల్డ్ మోడ్' అమలు చేయాలి.. కేంద్రానికి సూచన

న్యూఢిల్లీ, అక్టోబరు 17 (ప్రజాతీర్పు)

ఇంటర్నెట్ వినియోగించే హక్కు పెద్దలతోపాటు పిల్లలకూ ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పిల్లల ప్రాథమిక హక్కులను పరిగణనలోకి తీసుకోకుండా వయసు ఆధారంగా ఇంటర్నెట్ వినియోగంపై ఆంక్షలు విధించడం సమంజసం కాదని వ్యాఖ్యానించింది. ఇటువంటి పరిమితులు విధిస్తే చిన్నారులు ఇంటర్నెట్‌ను ఉపయోగించేందుకు చట్టవిరుద్ధమైన మార్గాలను ఆశ్రయించే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆన్‌లైన్‌లో ప్రలోభాలు, బెదిరింపులు లేదా వేధింపులు ఎదురైనప్పుడు, వాటిని బయటపెడితే ఇబ్బందులు -2వ పేజీలో

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఫోకస్!

వచ్చే ఏడాది జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేసింది. ఈ ఎన్నికలను అధికార పార్టీ ప్రతిష్మాత్మకంగా తీసుకుంది ఇప్పటికే రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన అధిష్మానం.. ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేసింది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం నుంచి సామ రామ్మోహన్ రెడ్డి, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానం నుంచి రామరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని కాంగ్రెస్ బరిలోకి దింపుతోంది.



- కాంగ్రెస్‌కు రెండు స్థానాలూ కీలకం
- ఇప్పటికే అభ్యర్థుల ఖరారు
- 77 మంది సమన్వయ కర్తల నియామకం
- ఢిల్లీలో సమీక్షించిన సీఎం రేవంత్‌రెడ్డి

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసిన కాంగ్రెస్.. ఇప్పుడు ఓటర్ల జాబితాలో అర్హులైన పట్టభద్రుల పేర్ల నమోదుపై ప్రధానంగా దృష్టి సారించింది. పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని నాయకత్వం సూచించింది.

సమన్వయకర్తలకు బాధ్యతలు

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఎన్నికల సన్నద్ధతను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి 43 మందిని, వరంగల్-ఖమ్మం-నల్గొండ నియోజకవర్గానికి 34 మందిని సమన్వయ కర్తలుగా నియమించింది. ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో వారికి బాధ్యతలు అప్పగించగా, ఇతర ప్రాంతాల్లో ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నేతలకు బాధ్యతలు కేటాయించారు. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఈ మేరకు బాధ్యతలను అప్పగించారు. కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ బాధ్యతలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు అనుముల తిరుపతి రెడ్డికి అప్పగించడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

సీఎం రేవంత్ సమీక్ష

ఢిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలతో సమావేశ మయ్యారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. రెండు స్థానాల్లోనూ విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం, పీసీసీ అధ్యక్షుడు నేతలకు సూచించినట్లు సమాచారం. ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా, అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

కీలకంగా ఓటర్ల నమోదు

ఈ ఎన్నికల్లో ఓటర్ల జాబితా కీలకంగా మారనుంది. తెలంగాణలోని రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటర్ల జాబితాను కొత్తగా సిద్ధం చేసే ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే పాత జాబితాలో పేర్లు ఉన్నవారు కూడా కొత్త జాబితాలో చోటు కోసం మళ్లీ దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం.. 2026 నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా, డిసెంబర్ 30న తుది జాబితా ప్రకటించనున్నారు. ప్రస్తుత సభ్యుల పదవీకాలం 2027 మార్చిలో ముగియనున్న నేపథ్యంలో, వచ్చే ఏడాది మార్చిలో ద్వైవార్షిక ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అయితే, పోలింగ్ తేదీలను ఎన్నికల సంఘం విడిగా ప్రకటించాల్సి ఉంది.

రేవంత్ ఈఎంఐ ముఖ్యమంత్రి



- అధిష్టానానికి ముడుపులు చెల్లించకుంటే పదవి పోతుందనే సింగరేణి ద్వారా స్కామ్
- నర్సంపేట నియోజకవర్గ నేతలతో సమావేశంలో కేటీఆర్
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో భేటీ


హైదరాబాద్,అక్టోబరు 17 (ప్రజాతీర్పు)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ఈఎంఐ ముఖ్యమంత్రి అని.. కాంగ్రెస్ అధిష్టానానికి కిస్తీలు కట్టకుపోతే సీఎం పదవి పోతుందనే భయం ఆయనకు పట్టుకుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ఎద్దేవా చేశారు. కిస్తీలు చెల్లించేందుకే విదేశీ బొగ్గు కొనుగోలులో వచ్చే కమీషన్ల ద్వారా నిధులు సమకూర్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గ -2వ పేజీలో

ఎల్‌నినో ముప్పు.. అడుగంటుతున్న జలాశయాలు

- సాగు, తాగునీటికి కష్టకాలం.. విద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం
- శ్రీశైలం నుంచి ఎస్సారెస్పీ వరకు నిల్వలపై ఒత్తిడి
- సాగర్‌లో ఇన్‌ఫ్లో కంటే అవుట్‌ఫ్లో అధికం
- నీటి నిర్వహణపై పెరుగుతున్న ఆందోళన

హైదరాబాద్, అక్టోబరు 17 (ప్రజాతీర్పు)



ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటే రాష్ట్రంలో జలవనరుల నిర్వహణ సవాలుగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే కొన్ని ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, సాగునీటి అవసరాలు పెరుగుతుండటం, తాగునీటి సరఫరాపై ఒత్తిడి ఏర్పడే అవకాశాలు ఉండటంతో జలాశయాల పరిస్థితి ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు జలవిద్యుత్ ఉత్పత్తి, దిగువ ప్రాజెక్టుల అవసరాల కోసం నీటిని విడుదల చేయాల్సి రావడం కూడా నిల్వల నిర్వహణను కీలకంగా మార్చుతోంది. శనివారం నాటి గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు ప్రాజెక్టులవారీగా భిన్నంగా ఉన్నాయి. కొన్ని జలాశయాల్లో నీటిమట్టాలు గరిష్ఠ స్థాయికి చేరువలో ఉండగా, మరికొన్నింటిలో నిల్వలు తక్కువగా ఉన్నాయి. అయితే ప్రస్తుత గణాంకాల ఆధారంగా తక్షణ నీటి -2వ పేజీలో

గోదావరి-కావేరి అనుసంధానం పేరిట

తెలంగాణపై భారీ కుట్ర



- ఈ ప్రాజెక్టును పోలవరం నుంచి చేపట్టాలని ఎన్‌డబ్ల్యూడీఏకి ఏపీ సీఎం లేఖ
- అడ్డుకోవాల్సిన తెలంగాణ సీఎం మౌనం దాల్చారు: హరీశ్‌రావు

హైదరాబాద్,అక్టోబరు 17 (ప్రజాతీర్పు)

గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరిట తెలంగాణపై భారీ కుట్ర జరుగుతోందని భారాస శాసనసభాపక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఈ రెండు నదుల అనుసంధానాన్ని పోలవరం నుంచి చేపట్టాలని కోరుతూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అక్టోబరు 7న లేఖ రాశారని, దాన్ని పరిగణనలోకి తీసుకొని నవంబరు 3న దిల్లీలో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) సమావేశానికి ఏర్పాట్లు చేసిందని ఆయన తెలిపారు. గోదావరి-కావేరి లింక్‌ను సమావేశ ఎజెండాలో చేర్చుతూ అన్ని రాష్ట్రాలకు సమాచారాన్ని కూడా పంపిందన్నారు. తెలంగాణ నీటి హక్కులపై ఇంత పెద్ద కుట్ర జరుగుతుంటే అడ్డుకోవాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు.

"గోదావరి జలాలను అక్రమంగా తరలించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్నారు. భారాస అధికారంలో ఉన్నన్ని రోజులూ వాటిని అడ్డుకున్నాం. గోదావరిలో 200 టీఎంసీలు తీసుకుపోయేందుకు తొలుత పోలవరం-బనకచర్లను తెరమీదికి తీసుకొచ్చారు. దాన్ని అడ్డుకుంటే నల్లమలసాగర్‌గా పేరు మార్చారు. ఇప్పుడు కేంద్రాన్ని ఒప్పించి గోదావరి-కావేరి నదుల అనుసంధానం పేరిట బనకచర్లకు మార్గం సుగమం చేసుకునేందుకు సిద్ధమయ్యారు. నేరుగా పోలవరం నుంచి బొల్లపల్లి, నాగార్జునసాగర్, సోమశిల ద్వారా కావేరికి నీళ్లు తరలించే ప్లాన్ -2వ పేజీలో

రేవంత్ ఈఎంఐ ముఖ్యమంత్రి

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.కాంగ్రెస్ అధిష్టానానికి చెల్లించాల్సిన ఈఎంఐలు వసూలు చేసేందుకే రాష్ట్రంలో ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జి రికవరీ ఏజెంట్‌లా పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. సింగరేణిని అడ్డుపెట్టుకొని సీఎం, మంత్రులు టెండర్లు, కమీషన్ల లెక్కలు వేసుకుంటున్నారని ఆరోపించారు. సింగరేణిలో కుంభకోణాలు, ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోలు వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సింగరేణిలో సౌర విద్యుత్ స్కామ్‌ను కూడా బయట పెడతామన్నారు.

వెయ్యి టీఎంసీలను వదిలేసి ఎల్‌నినో పేరిట చేతులెత్తేశారు

ఎల్‌నినోపై సరైన సమయంలో స్పందించకుండా సుమారు వెయ్యి టీఎంసీల గోదావరి జలాలను సముద్రంలోకి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఏమీ చేయలేమంటూ చేతులెత్తేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బరాజ్ వద్ద కన్నెపల్లి నుంచి దిగువకు వృథాగా వెళ్తున్న నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు తీసుకోకుండా ఇప్పుడు పంటలు ఎండుతూ సాగునీరు, తాగునీటి కొరత తీవ్రమవుతుండటంతో ఎల్‌నినో పేరిట సీఎం బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. నర్సంపేట నియోజకవర్గాన్ని అధికారంలోకి వచ్చాక దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌కు విద్యావంతులు బుద్ధి చెప్పడం ఖాయం

రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్లు, విద్యావంతులు, నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని.. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పడం ఖాయమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులతో కేటీఆర్ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు బాధ్యతగా తీసుకోవాలని కేటీఆర్ సూచించారు.సహకార సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

రాష్ట్రంలోని సహకార సంఘాలు, సహకార బ్యాంకులకు వెంటనే ఎన్నికలు నిర్వహించేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కేటీఆర్‌ను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు కోరారు. అన్ని జిల్లాల నుంచి వచ్చిన అధ్యక్షులు శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి సహకార రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మేనేజ్‌మెంట్ కమిటీలు లేకపోవడంతో సహకార బ్యాంకులు రైతులకు పంట రుణాలు అందించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అధ్యక్షులు తెలిపారు.

సీఈవోలకు పరిమిత అధికారాలే ఉండటంతో రూ.10 లక్షలకు మించిన రుణాల మంజూరులో సమస్యలు తలెత్తుతున్నాయని, జిల్లా సహకార బ్యాంకుల కార్యకలాపాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాల పంపిణీ ప్రభావితమవుతోందని వివరించారు. ఐఐటీలు, ఐఐఎంలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు సైతం విద్యా రుణాలు అందడం లేదన్నారు. పాలకవర్గాల పునరుద్ధరణ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉందని, న్యాయ ప్రక్రియలో జాప్యం నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే ఎన్నికలు నిర్వహించేలా ఒత్తిడి తేవాలని కేటీఆర్‌ను కోరారు. వారి విజ్ఞప్తిపై స్పందించిన కేటీఆర్.. ఎన్నికల నిర్వహణ కోసం తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ఎల్‌నినో ముప్పు..

అడుగంటుతున్న జలాశయాలు

(మొదటి పేజీ తరువాయి)

సంక్షోభాన్ని నిర్ధారించలేం. రాబోయే రోజుల్లో వర్షపాతం, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ప్రవాహాలు, సాగునీటి అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి కోసం చేసే నీటి విడుదలలను సమగ్రంగా పరిశీలించాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాలకు సాగునీరు, తాగునీరు, విద్యుత్ అవసరాల పరంగా కీలకమైన శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల పరిస్థితి ప్రాధాన్యం సంతరించుకుంది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం శ్రీశైలం జలాశయం పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 840.10 అడుగులుగా నమోదైంది. పూర్తి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలుగా పేర్కొనగా, ప్రస్తుత నిల్వ 219.74 టీఎంసీలుగా నివేదికలో వెల్లడించారు. ఇన్‌ఫ్లో 62,050 క్యూసెక్కులుగా ఉండగా, స్పిల్‌వే, పవర్‌హౌస్ ద్వారా 9,127 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, శ్రీశైలం పూర్తి నిల్వ సామర్థ్యం కంటే ప్రస్తుత నిల్వ ఎక్కువగా ఉన్నట్లు గణాంకాల్లో కనిపిస్తోంది. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 589.10 అడుగులుగా ఉంది. పూర్తి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా, ప్రస్తుత నిల్వ 309.36 టీఎంసీలుగా నమోదైంది. ఇన్‌ఫ్లో 1,46,190 క్యూసెక్కులుగా ఉండగా, అవుట్‌ఫ్లో 1,88,740 క్యూసెక్కులుగా ఉంది. అంటే జలాశయంలోకి వస్తున్న నీటితో పోలిస్తే బయటకు విడుదలవుతున్న నీరు 42,550 క్యూసెక్కులు అధికంగా ఉంది. ఈ పరిస్థితి కొనసాగితే, ఇతర ప్రవాహాలు, విడుదలలు మారకపోతే నిల్వలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంటుంది.

ఎస్సారెస్పీలో సగం సామర్థ్యమే

గోదావరి బేసిన్‌లో తెలంగాణకు కీలకమైన శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు (ఎస్సారెస్పీ) నిల్వల పరిస్థితి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు కాగా, ప్రస్తుతం 1,078 అడుగులుగా నమోదైంది. పూర్తి నిల్వ సామర్థ్యం 80.50 టీఎంసీలు కాగా, ప్రస్తుత నిల్వ 39.71 టీఎంసీలుగా ఉంది. అంటే పూర్తి సామర్థ్యంలో సుమారు 49.3 శాతం నీరు మాత్రమే అందుబాటులో ఉంది. పూర్తి సామర్థ్యంతో పోలిస్తే నిల్వ లోటు 40.79 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టులోకి 42,630 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు నివేదిక పేర్కొంది. ఈ ప్రవాహం ఎంతకాలం కొనసాగుతుంది? దిగువ ప్రాంతాల అవసరాలకు ఎంత నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది? అనే అంశాలు కీలకం కానున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గి, ఇన్‌ఫ్లోలు మందగిస్తే ఎస్సారెస్పీపై ఆధారపడే ఆయకట్టు ప్రాంతాల్లో సాగునీటి ప్రణాళికను జాగ్రత్తగా అమలు చేయాల్సి ఉంటుంది. నిజాంసాగర్ జలాశయంలో పూర్తి నీటిమట్టం 1,405 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1,399.12 అడుగులుగా నమోదైంది. ప్రస్తుత నిల్వ 10.43 టీఎంసీలుగా ఉంది. కడెం, లోయర్ మానేరు, మిడ్ మానేరు, శ్రీపాద ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టుల్లోనూ నీటి ప్రవాహాలు, నిల్వలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

సాగునీటి ప్రణాళిక కీలకం

వర్షాభావ పరిస్థితులు కొనసాగితే వ్యవసాయ రంగంపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ప్రధాన జలాశయాలపై ఆధారపడే ఆయకట్టు ప్రాంతాల్లో పంటల అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి నిల్వలను సమన్వయం చేయాల్సి ఉంటుంది. పంటలకు కీలక దశల్లో నీరు అందించడంతోపాటు తాగునీటి అవసరాలకు సరిపడా నిల్వలను కాపాడుకోవడం కూడా ముఖ్యమే. నీటి లభ్యత ఆధారంగా పంటల వారీగా అవసరాలను అంచనా వేయడం, కాలువల ద్వారా నీటి విడుదలకు ప్రాధాన్య క్రమం రూపొందించడం, నీటి వృథాను అరికట్టడం అవసరం. చెరువులు, కుంటల్లో మిగిలిన నీటిని సంరక్షించడంతోపాటు భూగర్భజలాల వినియోగాన్ని సమర్థంగా నిర్వహించాలి. వర్షాభావ తీవ్రతను బట్టి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు ముందస్తు సూచనలు ఇవ్వడం కూడా కీలకం.

జలవిద్యుత్ ఉత్పత్తిపైనా ప్రభావం?

శ్రీశైలం వంటి జలాశయాలు సాగునీటితోపాటు జలవిద్యుత్ ఉత్పత్తికి కూడా కీలకం. విద్యుత్ కేంద్రాల ద్వారా నీటిని విడుదల చేయడం, దిగువ ప్రాజెక్టుల అవసరాలకు ప్రవాహాలను కొనసాగించడం వంటి అంశాలు జలాశయాల నిల్వలపై ప్రభావం చూపుతాయి. వర్షాలు తగ్గి, ఎగువ నుంచి వచ్చే ప్రవాహాలు మందగించినప్పుడు నీటిని ఏ అవసరానికి ఎంత మేర వినియోగించాలన్నది కీలక నిర్ణయంగా మారుతుంది. విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే సమయంలో జలవిద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి లభ్యత తగ్గితే ఇతర విద్యుత్ వనరులపై ఆధారపడాల్సి రావచ్చు. అయితే ప్రస్తుత గణాంకాల ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని లేదా విద్యుత్ కోతలు తప్పవని నిర్ధారించలేం. వాస్తవ ఉత్పత్తి, నీటి విడుదల షెడ్యూల్, విద్యుత్ డిమాండ్ వివరాలను పరిశీలించినప్పుడే ప్రభావంపై స్పష్టత వస్తుంది.

జలాశయాల నిల్వలు తగ్గడం దీర్ఘకాలం కొనసాగితే పట్టణాలు, గ్రామాల తాగునీటి సరఫరాపైనా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ప్రధాన జలవనరులపై ఆధారపడే ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు కేటాయించిన నిల్వలను కాపాడుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. నీటి సరఫరా వ్యవస్థల్లో లీకేజీలను అరికట్టడం, ప్రత్యామ్నాయ వనరులను గుర్తించడం, అవసరమైన చోట ముందస్తు సరఫరా ప్రణాళికలు రూపొందించడం అవసరం. ఎల్‌నినో ప్రభావం ఎంతకాలం కొనసాగుతుంది, రాష్ట్రంలో వర్షపాతం ఎలా ఉంటుంది, జలాశయాలకు వచ్చే ప్రవాహాలు ఏ స్థాయిలో కొనసాగుతాయి అన్న అంశాలే రాబోయే రోజుల్లో నీటి పరిస్థితిని నిర్ణయించనున్నాయి. అందువల్ల రోజువారీ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను సమీక్షిస్తూ, సాగు, తాగునీరు, విద్యుత్ అవసరాల మధ్య సమతుల్యత సాధించేలా ముందస్తు కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉంది.

గోదావరి-కావేరి
అనుసంధానం పేరిట తెలంగాణపై భారీ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. గోదావరి–కావేరి అనుసంధానానికి మేము వ్యతిరేకం కాదు. తెలంగాణ హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలపైనే మా అభ్యంతరం. సమ్మక్కసాగర్ నుంచి నాగార్జునసాగర్ మీదుగా తీసుకెళ్తే తెలంగాణ ప్రాంతానికి నీళ్లు వస్తాయి. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా నదుల అనుసంధానం జరపడానికి కేంద్రం గతంలోనే ఒప్పుకొంది. సరిహద్దు రాష్ట్రాలు కూడా అంగీకరించాయి.

ఈ నదుల అనుసంధానం చేయాలనుకుంటే ముందుగా తెలంగాణకు రావాల్సిన నీటి వాటా 968 టీఎంసీలకు అనుమతివ్వాలి. తీసుకుపోయే నీళ్లలోనూ 50% ఇవ్వాలి. కానీ, ఏపీ ప్రభుత్వం ఇచ్చంపల్లి నుంచి కాకుండా పోలవరానికి మార్చాలంటోంది. ఇచ్చంపల్లి నుంచి నాగార్జునసాగర్ మీదుగా వెళ్తే తెలంగాణలో 2,38,236 ఎకరాలకు నీళ్లు పారతాయి. కొత్త ప్రతిపాదనతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఏపీ సీఎం లేఖ రాసి పది రోజులవుతున్నా తెలంగాణ సీఎం ఎందుకు మౌనం వహిస్తున్నారు? రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కూడా ఎందుకు దీనిపై స్పందించడంలేదు? తెలంగాణ నీటి వనరులకు నష్టం వాటిల్లితే కేసీఆర్ నాయకత్వంలో మరో జలపోరాటానికి శ్రీకారం చుడతాం" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

పోలీసు పోస్టుల సంఖ్య 25 వేలకు పెంచాలి

పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్లో పోస్టుల సంఖ్యను 25 వేలకు పెంచాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పలువురు పోలీసు ఉద్యోగ అభ్యర్థులు, నిరుద్యోగ యువత శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. "రాష్ట్రంలో 25 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం 7 వేల పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగ యువతను వంచించడమే. తాజా కానిస్టేబుల్ నోటిఫికేషన్లో హైదరాబాద్, సైబరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల అభ్యర్థులకు సివిల్, ఏఆర్ కానిస్టేబుల్ పోస్టులు ఒక్కటి కూడా కేటాయించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం నిరుద్యోగ యువత ఆకాంక్షలకు అనుగుణంగా పోలీసు పోస్టుల సంఖ్యను పెంచాలి" అని హరీశ్‌రావు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

పిల్లలకు ఇంటర్నెట్ హక్కును
నిరాకరించలేం.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

వస్తాయనే భయంతో పిల్లలు తల్లిదండ్రులకు చెప్పకుండా దాచిపెట్టే పరిస్థితి ఏర్పడవచ్చని అభిప్రాయపడింది. జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. పిల్లల భద్రత, ఇంటర్నెట్ వినియోగ స్వేచ్ఛ పరస్పరం విరుద్ధమైన అంశాలు కావని, రెండింటినీ సమన్వయం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఆలోచనల వ్యక్తీకరణకు, సృజనాత్మకతకు, సమాచార మార్పిడికి ఇంటర్నెట్ ఒక ముఖ్యమైన వేదికగా మారిందని తెలిపింది. అందువల్ల పిల్లలకు ఇంటర్నెట్ సదుపాయాన్ని పూర్తిగా నిరాకరించడం సరైన పరిష్కారం కాదని స్పష్టం చేసింది.

మారుమూల ప్రాంతాల పిల్లలకు ఇంటర్నెట్ కీలకం

ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే పిల్లలకు ఇంటర్నెట్ సమాచారాన్ని పొందేందుకు కీలకమైన వనరుగా ఉపయోగపడుతోందని న్యాయస్థానం పేర్కొంది. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు ఇతరులతో అనుసంధానం కావడానికి, ఇంటి నుంచే వివిధ అంశాలను నేర్చుకోవడానికి ఆన్‌లైన్ వేదికలు దోహదపడుతున్నాయని వివరించింది. అయితే, హానికరమైన కంటెంట్‌ను గుర్తించి తొలగించడంలో సోషల్ మీడియా సంస్థలు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల పిల్లలకు ఇంటర్నెట్ ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యకు పరిష్కారంగా చిన్నారులను పూర్తిగా సోషల్ మీడియాకు దూరం చేయడం సరికాదని అభిప్రాయపడింది. పిల్లల ఆన్‌లైన్ భద్రతను పెంచే చర్యలు తీసుకోవడమే సముచితమని సూచించింది.

చిన్నారుల ఖాతాలకు ప్రత్యేక 'చైల్డ్ మోడ్'

సోషల్ మీడియా వేదికల్లో పిల్లల ఖాతాలను మరింత భద్రంగా ఉంచేందుకు ప్రత్యేకంగా 'చైల్డ్ మోడ్'ను ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలించాలని ధర్మాసనం సూచించింది. పిల్లలకు అనువైన భద్రతా నియంత్రణలు, రక్షణాత్మక సదుపాయాలను యాప్‌లు అందించడం ద్వారా వారి ఇంటర్నెట్ వినియోగాన్ని సురక్షితంగా మార్చవచ్చని పేర్కొంది. అదే సమయంలో, చిన్నారులకు సంబంధించిన లైంగిక వేధింపుల కంటెంట్‌ను సోషల్ మీడియా వేదికల నుంచి తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇటువంటి కంటెంట్ ఆన్‌లైన్‌లో కొనసాగకుండా సమర్థవంతమైన నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపింది. పిల్లల ఇంటర్నెట్ వినియోగంపై సంపూర్ణ నిషేధాలకంటే, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని కల్పించడం, సోషల్ మీడియా సంస్థల బాధ్యతను పెంచడం, హానికరమైన కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవడం ముఖ్యమని ధర్మాసనం సూచించింది.



భక్తులపై దూసుకెళ్లిన ట్రక్.. 11 మంది మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గ్వాలియర్ జిల్లా శీతలా మాత ఆలయం సమీపంలో భక్తులపైకి ట్రక్కు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో పలువురు భక్తులు మృతి చెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయానికి సమీపంలో ఉన్న భక్తులపైకి ట్రక్కు దూసుకెళ్లడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

దుర్గా మండపంలో తొక్కిసలాట

(మొదటి పేజీ తరువాయి)

సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఉత్తర కోల్‌కతాలోని శారదా పార్కువద్ద ఉన్న ఈ మండపంలోని ఇరుకైన నిష్క్రమణ మార్గంలో రాత్రి 7.40 గంటల సమయంలో ఈ తొక్కిసలాట చోటుచేసుకుంది. వారాంతం కావడంతో జనం అధికంగా రావడం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఇరుకుగా ఉండటం, వర్షం పడటంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. జనసమంతా నిష్క్రమణ మార్గంవైపు ఒకేసారి వెళ్లడంతో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. దీంతోపాటు ఆ మార్గమంతా చీకటిగా ఉంది.

మండపం వద్ద పోలీసుల పరిశీలన

ప్రవేశమార్గం వద్ద గంటన్నరగా భక్తులు వేచి ఉన్నారు. వర్షం రావడంతో వారంతా లోనికి ప్రవేశించేందుకు తొందరపడ్డారు. దీంతో నిష్క్రమణ మార్గంపై ఒత్తిడి పడింది. అది చీకటిగా ఉండటం తొక్కిసలాటకు దారితీసింది. తొలుత చిన్న పిల్లలిద్దరు పడిపోయారు. వారిపై మిగతావారంతా పడటంతో గందరగోళం నెలకొని తొక్కిసలాటకు దారితీసింది. సమాచారం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. చనిపోయిన వారికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్ సంతాపం తెలిపారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రధాని ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50,000 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.కోల్‌కతాలోనే ఉన్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులను పరామర్శించటానికి తన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకున్నారు.

ప్రశ్నించే నోళ్లను మూయించేందుకే
పోలీసు దౌర్జన్యం: రాహుల్‌గాంధీ

విద్యార్థి సంఘం నేతలతో తన నివాసంలో భేటీ అయిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



దిల్లీ: ఇకపై ఎవరూ ప్రశ్నించే ధైర్యం చేయకుండా ప్రజల నోళ్లను మూయించే కుట్రలో భాగంగానే విద్యార్థులు, మహిళలపై దిల్లీ పోలీసులు ఇటీవలి ప్రదర్శనల్లో తీవ్ర అణచివేతకు పాల్పడ్డారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ శనివారం ఆరోపించారు. పోలీసు దౌర్జన్యం సిగ్గుపడాల్సిన రీతిలో అన్ని హద్దులూ దాటిపోయిందని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. "ప్రజాస్వామ్యం కోసం గళం విప్పిన విద్యార్థులు, మహిళలకు వ్యతిరేకంగా దిల్లీ పోలీసుల దౌర్జన్యం హద్దు మీరిపోయింది. ఇందులో భాగంగా దిల్లీ పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడటం, వస్త్రాలు లాగడం, వంటి సిగ్గుమాలిన పనులు చేశారు" అని ఆయన అన్నారు."ఇదంతా ప్రజా గళాన్ని మూయించే కుట్రలో భాగం. ఎవరూ ప్రశ్నించే సాహసం చేయకుండా నిరోధించాలనే కుట్రలో భాగంగా నిరసనకారుల్లో భయాన్ని నింపుతూ వారిని తీవ్రంగా అవమానించడమే ఈ దమననీతి ఆంతర్యం" అని ఆయన అన్నారు. "అధికారం చేజారిన మరుక్షణం తమ ఇష్టారాజ్యం అంతమైపోతుందని మోదీ–షాలకు తెలుసు. ఆ భయంతోనే పోలీసుల సాయంతో దేశంలోని మహిళలపై, యువజనులపై హింస, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు" అని ఆయన అన్నారు. ఇటీవలి నిరసన ప్రదర్శనల్లో పోలీసుల చేతిలో తీవ్ర దౌర్జన్యానికి గురైన కొందరు యువకులతో తాను జరిపిన సంభాషణకు సంబంధించిన పది నిమిషాల వీడియోను కూడా ఆయన తన పోస్టుకు జతచేశారు.

ఐరాస నివేదికను కొట్టిపారేసిన భారత్..
అదొక వదంతి మాత్రమే!



దేశ యువత సృష్టించిన 'వ్యంగ్య రాజకీయ ఉద్యమాన్ని' ప్రస్తావించిన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల నిపుణురాలి నివేదికను భారతదేశం కొట్టిపారేసింది. అదొక వదంతి మాత్రమేనని తేల్చిచేసింది. ధ్రువీకరించని ఆరోపణలు చేయడం సరైంది కాదని పేర్కొంది. ఏదైనా మాట్లాడేముందు నిజానిజాలు తెలుసుకోవాలని ఆ నిపుణురాలికి సూచించింది.ఐరాస సర్వసభ్య సమావేశం మూడో కమిటీ 81వ సమావేశంలో భారత ప్రతినిధి అనూజ్ స్వరూప్ ఈ మేరకు ప్రకటన చేశారు. భారతదేశంలోని యువత మానసిక ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి చర్చించినందుకు ప్రతీకారం లేదా వివక్షను ఎదుర్కొంటున్నారని ఆక్షేపిస్తూ 'ఫ్రీడమ్ ఆఫ్ పీసుఫుల్ అసెంబ్లీ, అసోసియేషన్' ప్రత్యేక ప్రతినిధి గినా రోమెరో నివేదిక సమర్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆమె వాదనను ఖండించారు. ధ్రువీకరించని ఆరోపణల ఆధారంగా ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభాపై చేసిన ఈ తీవ్రమైన ఆరోపణలో ఎంతమాత్రం నిజం లేదని ఉద్ఘాటించారు. ఇది ఐక్యరాజ్యసమితి నివేదిక ముసుగులో జరిగిన వదంతి మాత్రమేనని తెలిపారు. తమ ప్రతినిధి బృందం దీనిని పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు స్వరూప్ తేల్చిచెప్పారు. 140 కోట్ల మంది ప్రజల గురించి ప్రచారం చేయడానికి అజ్ఞాత వ్యక్తులు అందించిన సమాచారంపై ఆధారపడిన ఒక బాధ్యతాయుత అధికారి, తనకు అప్పగించిన బాధ్యతకే అపకారం చేస్తున్నారని విమర్శించారు. ఎవరినైనా విమర్శించే ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని స్పష్టంచేశారు. అలాగే నివేదికల్లో నిజాయతీ, నిష్పాక్షికతను పాటించాలని కోరుతున్నట్లు చెప్పారు.



కరెన్సీ నోట్లతో కాళరాత్రిదేవి అవతారం

- ఆమ్మవారిని దర్శించుకున్న కరీంనగర్ సెషన్స్ జడ్జి
- ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ప్రజా తీర్పు):

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజైన శనివారం శ్రీ మహాశక్తి ఆలయంలో శ్రీ మహాలక్ష్మీ దేవి (కాళరాత్రి) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీతో నిజ పాద దర్శన రూపంలో ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ మహాలక్ష్మీ దేవిని భక్తులు దర్శించుకున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఉదయం నుండి సాయంత్రం వరకు పూజలు నిర్వహించడంతోపాలు అమ్మవారి సేవలో తరించారు. ఆలయానికి వచ్చిన భక్తులను కలుసుకుంటూ వారితో ముచ్చటించారు. సాయంత్రం 6 గంటలకు శ్రీ లక్ష్మీ సాహస్ర పారాయణం విన్పించారు. అనంతరం బ్రహ్మశ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ పండితులు"శ్రీ భాగవత వైభవం" వివరిస్తూ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు కరీంనగర్ జిల్లా సెషన్స్ జడ్జి ఎస్ శివకుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాండియా కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీలకు వాగ్దేవి కళాశాల విద్యార్థి ఎంపిక

- 75 కిలోల విభాగంలో సత్తా చాటిన మొగిలి సూర్యతేజ
- విద్యార్థిని అభినందించిన కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 17

ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ బాక్సింగ్ పోటీలకు కరీంనగర్‌కు చెందిన వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి మొగిలి సూర్యతేజ ఎంపికయ్యాడు. శుక్రవారం కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీల్లో 75 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచి ఈ అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఈ నెల 30వ తేదీన ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో జరగనున్న ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయ బాక్సింగ్ పోటీల్లో సూర్యతేజ పాల్గొననున్నట్లు కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ తెలిపారు.

విద్యార్థికి చైర్మన్ అభినందనలు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సూర్యతేజను కళాశాల చైర్మన్ గోవిందవరం కృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలకు కూడా కళాశాలలో సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనడం తమకు గర్వకారణమని అన్నారు. సూర్యతేజ ఆల్ ఇండియా పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ. మునిందర్ గౌడ్, ఫిజికల్ డైరెక్టర్ ఏ. శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని సూర్యతేజకు అభినందనలు తెలిపారు.



బతుకమ్మ సంబరాలు, ఫ్యామిలీ డే ఏర్పాట్లను పరిశీలించిన జీఎం వి. కృష్ణయ్య

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు ఇల్లందు) అక్టోబర్ 17

సింగరేణిఏరియాలోని జేకే కాలనీలో గల బ్లాక్ డైమండ్ స్టేడియంలో అక్టోబర్ 18న నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలు, ఫ్యామిలీ డే వేడుకలకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పర్సనల్, సివిల్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. బతుకమ్మ ఆడే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని, స్టేడియానికి వచ్చే ప్రతి ఒక్కరికీ తాగునీటి సౌకర్యం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. అలాగే మైదానంలోని గడ్డిని తొలగించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, బతుకమ్మ నిమజ్జనం చేసే ప్రదేశంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొంటూ, మహిళలు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొనేలా వేడుకలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని జీఎం తెలిపారు.సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు, ఫ్యామిలీ డే వేడుకల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, పట్టణ ప్రజలు, మహిళలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జీఎం వి. కృష్ణయ్య కోరారు.ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జి.యం జాకీర్ హుస్సేన్, డీజీఎం (పర్సనల్) అజ్మీర్ తుకారాం, డీజీఎం (ఏరియా వర్కషాప్) నాగరాజు నాయక్, డీవైఎస్ వినయ్ సాగర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి నరసింహారావు, దేవేందర్ నాయక్, షాకిబ్ హుస్సన్, సంజయ్, జూనియర్ ఇన్స్పెక్టర్ రాజేష్, సీనియర్ పి.ఓ జి.సుధాకర్ పాల్గొన్నారు.

మహిళా ఐక్యతకు, ఆడపిల్లల హక్కులకు ప్రతీక బతుకమ్మ సంబరాలు

- ఆడపిల్లలను చదివిద్దాం.. అన్ని రంగాల్లో ఎదిగేలా ప్రోత్సహిద్దాం
- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి పిలుపు

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 17



బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి అన్నారు. ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కోతి రాంపూర్ పోచమ్మవాడలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి మాట్లాడుతూ, పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకోవడంతో పాటు మహిళల హక్కుల పరిరక్షణ కోసం కూడా మహిళలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళల ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు.

ఆడపిల్లలపై వివక్షను విడనాడాలి

నేటి సమాజంలో ఆడపిల్లలపై వివక్ష, మహిళలపై హింస, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు కొనసాగడం ఆందోళనకరమని నాగమణి అన్నారు. ఆడపిల్లలను భారంగా భావించకుండా, వారికి సమాన అవకాశాలు కల్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. అన్ని రంగాల్లో స్వేచ్ఛగా ఎదిగేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత కుటుంబాలు, సమాజంపై ఉందన్నారు.

"ఆడపిల్లను పుట్టనిద్దాం.. పెరగనిద్దాం.. ఎదగనిద్దాం.. చదవనిద్దాం.. గౌరవిద్దాం"

అనే నినాదంతో ప్రతి ఇంటిలో ఆడపిల్లలకు సమాన హక్కులు కల్పించాలని పిలుపునిచ్చారు. మహిళలకు విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన అందించడంతో పాటు, మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహిళా హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

బతుకమ్మ పండుగను ప్రకృతిని ప్రేమిస్తూ, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పోరాడే స్ఫూర్తితో జరుపుకోవాలని నాగమణి అన్నారు. మహిళలందరూ ఐక్యంగా ముందుకు వచ్చి హక్కుల సాధన కోసం ఐద్వా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు బానోత్ రాజమణి, కోనేటి శిరీష, కారుపాకల మున్న, భార్గవి, తిరుమల, రామంచ రాజవ్వ, నిర్మల, సుమ, సౌందర్య, అన్నపూర్ణ, రాజవర్ధిని, సంతోష తదితరులు పాల్గొన్నారు.



ఐదో రోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె

- జీఓ 60&1195 ప్రకారం పెరిగిన వేతనాలు అమలు చేయాలి
- క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టరేట్ ఎదుట ఆందోళన

(జక్కుల శ్రీకాంత్ కరీంనగర్ ,ప్రజా తీర్పు ప్రతినిధి) అక్టోబర్ 17:

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఐదో రోజుకు చేరింది. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు జీఓ 60, 1195 ప్రకారం పెరిగిన వేతనాలను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులందరినీ స్టేట్ హెల్త్ సొసైటీ (ఎస్‌హెచ్‌ఎస్) పరిధిలో కొనసాగించాలని కోరుతున్నారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడదని జేఏసీ పేర్కొంటోంది. 2022 నుంచి ప్రతి ఉద్యోగికి 5% వార్షిక ఇంక్రిమెంట్‌తో పాటు 8% లాయల్టీ బోనస్ ఇవ్వాలని, లింగభేదం లేకుండా 180 రోజుల వేతనంతో కూడిన మహిళలకు ప్రసూతి సెలవులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగి మరణిస్తే రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా, బీమా సదుపాయం కల్పించడంతో పాటు కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. ఉద్యోగ భద్రతతో పాటు జుూూ ఽ జూూ× సౌకర్యం కల్పించాలని, తొమ్మిది నెలల పీఆర్సీ బకాయిలు, ఇతర వేతన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి నెల ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేయాలి

- రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి
- వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ గుండాటి గోపిక- జితేందర్ రెడ్డి

(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) అక్టోబర్ 17:



రాష్ట్ర ప్రభుత్వం ఆవలంబిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని, ఆరుగాలం శ్రమించిన పంటలు చేతికందకుండా ఎండి పోయే ప్రమాదం ఉందని బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు, వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్ పర్సన్ గుండాటి గోపిక- జితేందర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. హై ఓల్టేజ్, లో ఓల్టేజ్ వల్ల పదేపదే కరెంటు ట్రిప్ కావడంతో రైతుల పొలాల్లో విద్యుత్ మోటార్లు కాలి పోతున్నాయని, దీని వల్ల రైతులు ఆర్థికంగా నష్ట పోతున్నారని పేర్కొన్నారు. ఎల్ ని నో ప్రభావంతో రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోయారని, దానికి తోడు విద్యుత్ కోతలు విధించడంతో రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అప్రకటిత విద్యుత్ కోతలు ఎత్తివేసి, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా రాజ్ కుమార్ యాదవ్ నియామకం

(ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) అక్టోబర్ 17 :



పిఆర్టీయూ(టిఎస్) రాష్ట్ర కార్యదర్శిగా ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఈరవేణి రాజకుమార్ యాదవ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పీఆర్టీయూ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన రాజ్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధన కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొంటూ, తన నియమాకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీఎఫ్ఎంఎస్‌తో విద్యుత్ సేవలు మరింత మెరుగు

- కరీంనగర్ సర్కిల్‌లో 97 సబ్‌స్టేషన్లు స్కాడాకు అనుసంధానం
- అంతరాయాలను తక్షణమే గుర్తించి పరిష్కరించే అవకాశం: ఎస్ఈ విజయేందర్ రెడ్డి

(ఇమ్రాన్ జోహ్రా, ప్రజాతీర్పు, కరీంనగర్) అక్టోబర్ 17



విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ. విజయేందర్ రెడ్డి తెలిపారు. రియల్‌టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ (ఆర్టీఎఫ్ఎంఎస్) అమలులో భాగంగా కరీంనగర్ సర్కిల్ పరిధిలోని 97 సబ్‌స్టేషన్లను స్కాడా వ్యవస్థకు అనుసంధానం చేసినట్లు వెల్లడించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, అంతరాయాలను తగ్గించడం, సమస్యలను వేగంగా గుర్తించి పరిష్కరించడం, ఫీడర్ల పనితీరును సమర్థవంతంగా పర్యవేక్షించడం సాధ్యమవుతుందని వివరించారు.

రియల్‌టైమ్‌లో విద్యుత్ సరఫరాపై పర్యవేక్షణ

ఆర్టీఎఫ్ఎంఎస్ ద్వారా విద్యుత్ ఫీడర్ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించవచ్చని ఎస్ఈ తెలిపారు. విద్యుత్ అంతరాయాలు, ఓవర్‌లోడ్, వోల్టేజ్ హెచ్చుతగ్గులు వంటి సమస్యలను తక్షణమే గుర్తించి సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బందిని అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీంతో సమస్యల పరిష్కారంలో జాప్యాన్ని తగ్గించి, విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించేందుకు వీలవుతుందని వివరించారు.

ఆర్టీఎఫ్ఎంఎస్‌తో కీలక ప్రయోజనాలు

- స్కాడా కంట్రోల్ రూమ్ నుంచే విద్యుత్ సరఫరా పరిస్థితిని రియల్‌టైమ్‌లో పర్యవేక్షించవచ్చు.
- ఫీడర్లలో విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే అలర్ట్‌లు అందుతాయి.
- ఓవర్‌లోడ్ సమస్యలను తక్షణమే గుర్తించి హెచ్చరికలు పొందవచ్చు.
- విద్యుత్ వినియోగం, వోల్టేజ్ స్థాయిలు, లోడ్‌కు సంబంధించిన వివరాలను సేకరించి విశ్లేషించవచ్చు.
- సమస్యలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టవచ్చు.
- క్షేత్రస్థాయి సిబ్బంది స్పందన వేగం పెరిగి, విద్యుత్ అంతరాయ సమయాన్ని తగ్గించవచ్చు.
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయవచ్చు.

వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యం

విద్యుత్ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తూ, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే దిశగా టీజీఎన్‌పీడీసీఎల్ ముందుకు సాగుతోందని ఎస్ఈ విజయేందర్ రెడ్డి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులు- నియంతృత్వ ధోరణులు - వామపక్షాల కర్తవ్యం

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 17



ఎం సి పి ఐ యు పార్టీ మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ గారి 18వ వర్ధంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం లో స్మారక స్థూపం వద్ద ఘన నివాళులు అర్పించిన ఎం సిపిఐ(యు) పార్టీ నాయకులు మతోన్మాద దోపిడీ విదానాలకు ప్రత్యామ్నాయం మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానమే వర్గ సామాజిక ఐక్యతకు నికరంగా నిలబడి పోరాడేది ఎం సి పి ఐ (యు)మాత్రమే ఎం సి పి ఐ (యు) పార్టీ జిల్లాకార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్,జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ దేశంలో పెట్రేగిపోతున్న మతోన్మాద దోపిడి విధానాలకు ప్రత్యామ్నాయం మార్క్సిజం అంబేద్కర్ ఆలోచన విధానమే ఏకైక మార్గమని అందుకోసం నికరంగా నిలబడి ముందుకు సాగుతున్న పార్టీ ఎం సి పి ఐ (యు) మాత్రమే అని ఎం సి పి ఐ (యు)పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎం సి పీ ఐ (యు) మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలో పార్టీ జిల్లాసహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ అధ్యక్షతన ప్రజాస్వామ్య హక్కులు - నియంతృత్వ -- వామపక్షాల కర్తవ్యం అనే అంశంపై ఎం సి పి ఐ (యు) వ్యవస్థాపకులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 18వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో వారి స్మారక స్థూపం వద్ద వారి చిత్రపటానికి పార్టీ,ప్రజా సంఘాల నాయకులు పూలమాలవేసి ఘనం గా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్,సభ అధ్యక్షులు పసులేటి వెంకటేష్,మాట్లాడుతూ 80 సంవత్సరాల స్వాతంత్ర భారత దేశంలో ఆకలి, దారిద్రం. నిరుద్యోగం. ఆత్మహత్యలు,అత్యాచారాలు, హింసతోపాటు కుల-మత బేధాలు, ప్రాంతీయ తత్వాలను పాలకవర్గాలు అనైతిక రాజకీయ విధానాలతో పెంచి పోషిస్తూ సెక్యులర్ పేరుతో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన ఆర్థిక దోపిడితో పాటు కులమత తత్వాలను పెంచి,పోషించిందని, ఆర్ఎస్ఎస్ భావజాలంతో మూడోసారి కేంద్రాన్ని పాలిస్తున్న బిజెపి కూడా తన మత భావాజాలన్నీ పెంపొందించుకుంటూ మైనార్టీ, మతాలపై,దళిత, గిరిజన, అట్టడుగు వర్గాలపై మనువాద పాలన పేరుతో దాడులకు పూనుకుంటూ వస్తుందని,గత పాలకవర్గం లాగానే కార్పొరేట్, పెట్టు బడుదారి వర్గాలకు దేశ సంపదను ఆదాని, అంబానీలకు,కట్టబెట్టిందని ,తన మతోన్మాద పెట్టుబడుదారి,ఆర్థిక విధానాలను ప్రశ్నించిన వారిపై పాసీజంతో దురాహంకారపూరితమైన ఉన్మాదా చర్యలకు పూనుకుంటుందని,ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ, లాంటి స్వతంత్ర వ్యవస్థలను తన గుప్పిట్లో పెట్టుకొని దేశ రాజకీయ వ్యవస్థలను కలుషితం చేస్తుందని,భారత రాజ్యాంగం,ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నదని,ఒకే దేశం,ఒకే మతం,ఒకే భాష అంటూ ఒకే ఎన్నికల పేరుతో జమిలి ఎన్నికల విధానానికి ఒడిగట్టి ప్రజాస్వామ్య విలువలను,రాజ్యాంగ విలువలను సమాధి చేస్తుందని, అనేక ఆంక్షల నేపథ్యంలో సాధించుకున్న మన తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ కూడా రాష్ట్ర అభివృద్ధి పేరుతో కేంద్రంలోని బిజెపి చేసిన తప్పుడు చట్టాలను ప్రజా వ్యతిరేక విధానాలను బలపరుస్తున్నాయని,కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న పాసిస్ట్,మనువాద విధానాలకు, సెక్యులర్ ముసుగులో ఉన్న కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా కార్పొరేట్, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను కొనసాగిస్తున్న దోపిడి వర్గాల పాలనలో సమస్త హక్కులు కోల్పోతున్న శ్రామిక వర్గ ఐక్య పోరాటాల బలోపేతానికి మార్క్సిజమే మార్గదిశగా, తరతరాలుగా అసమానలతో అణిగిమనిగి ఉన్న భారత సమాజాన్ని అంబేద్కర్ ఆలోచన విధానంతో నిర్మూలించే దిశగా రాజకీయ ఆర్థిక సామాజికసమానత్వాన్ని బహుజనులకు రాజ్యాధికారాన్ని సాదించేందుకు ఎంసిపిఐ (యు) పార్టీ ముందుండి పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,మండల కార్యదర్శి సతీష్,మహిళ సమాఖ్య నాయకులు కాంపల్లి రాధ,దుర్గం లక్ష్మి, కామెర పద్మ,యువజన,విద్యార్థి నాయకులునరేష్,శేఖర్, సాయి,రాం,మహేష్,ఆకాష్,అరుణ్ వివిధ మండలాల నాయకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు



కాయకల్ప అవార్డ్స్ 2025-26లో మంచిర్యాల జిల్లాకు ఘన విజయం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 17

కాయకల్ప అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఘన విజయాన్ని సాధించిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నర్సూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో టి.వి.వి.పి. వైద్యాధికారులను శాలువాతో సన్మానించి, మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాయకల్ప అవార్డ్స్ 2025--26 కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రి రన్నరప్‌గా నిలిచి 10 లక్షల రూపాయల నగదు బహుమతిని గెలుచుకోగా, చెన్నూరు ఏరియా ఆసుపత్రి, లక్షెట్టిపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లు కమెండేషన్ అవార్డులతో పాటు ఒక్కొక్కటి 1 లక్ష రూపాయల నగదు బహుమతిని సాధించాయని తెలిపారు. ఆసుపత్రులలో పారిశుధ్యం, పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ ప్రమాణాల మెరుగుదలకు వైద్యులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని తెలిపారు. ఈ విజయంలో 3 ఆసుపత్రుల పర్యవేక్షకులతో పాటు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కృషి అభినందనీయమని తెలిపారు. ఆసుపత్రులలో పరిశుభ్రమైన వాతావరణాన్ని కొనసాగిస్తూ, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ 3 ఆసుపత్రుల పర్యవేక్షకులు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ప్రచార చైతన్య రథం ప్రారంభం...

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 17

అడిషినల్ కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ జెండా ఊపి ప్రారంభించారు.వెట్టిచాకిరీ పై అవగాహన కల్పించటం, మరియు బాండెడ్ లేబర్ హెల్ప్ లైన్ 080-69434343 ను ప్రజలకు చేరువ చేయటం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్ర వ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ వాహనాన్ని జిల్లాలో ప్రారంభించారు. ఈ ప్రచార వాహనం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, వెట్టిచాకిరీ, కార్మిక హక్కులు, దోపిడికి గురైన సందర్భాల్లో ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న విధానాలపై ప్రజలకు, కార్మికులకు అవగాహన కల్పిస్తుంది ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక కమిషనర్ శ్రీ ఎం. సురేంద్రకుమార్, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి, జిల్లా వెటర్నిటి అధికారి, వివిధ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా న్యాయ సేవ సంస్థ సిబ్బంది మరియు ఎవో కలెక్టరేట్ గారు పాల్గొన్నారు.



శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్

- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి: జిమ్మి దేవేందర్

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 17 (ప్రజా తీర్పు):

కొంపల్లి డివిజన్ పరిధిలోని అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జిమ్మి దేవేందర్ మాట్లాడుతూ.. దుర్గాదేవి అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఐష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత వెల్లివిరియాలని, ప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు, ఐకమత్యాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి ఉత్సవాలు మన సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అనంతరం వీర హనుమాన్ యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎస్.కె. కదిర్, పార్వతమ్మ, భారతి, అక్షయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగ నియామకాలపై ప్రజలకు విజ్ఞప్తి

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 17



వైద్య ఆరోగ్య శాఖలో ప్రకటించిన ఉద్యోగాల నియామక ప్రక్రియ మంచిర్యాల జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్ గా వ్యవహరించే జిల్లా ఎంపిక కమిటీ (డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ, డీ,ఎస్,సి) ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుంది. ఈ నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిర్దేశిత మెరిట్ మరియు రోస్టర్ విధానం ఆధారంగా జరుగుతుంది.కావున, నిరుద్యోగ యువత మరియు ఉద్యోగ అభ్యర్థులకు విజ్ఞప్తి ఏమనగా, ఎవరైనా మధ్యవర్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామని హామీ ఇచ్చినా నమ్మవద్దు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు డిమాండ్ చేసే వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు చెల్లించవద్దు. ఎలాంటి డబ్బులు, సిఫార్సులు లేదా ఇతర ప్రలోభాలకు ఉద్యోగ నియామకాల్లో చోటు లేదు. అటువంటి మోసపూరిత హామీలను నమ్మడం వల్ల ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అధికారిక సమాచారం మరియు ప్రకటనలను మాత్రమే విశ్వసించండి. ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాము. మీ ప్రతిభే మీ అర్హత మీ మెరిటే మీ ఎంపిక మోసపూరిత హామీలకు దూరంగా ఉండండి. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మంచిర్యాల జిల్లా.

టేకులపల్లిలో ఘనంగా శ్రీమహాలక్ష్మీ దేవి అలంకరణ

రూ.5 లక్షలతో అమ్మవారి విశేష పూజలు

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) అక్టోబర్ 17



టేకులపల్లి మండల కేంద్రంలోనీ బ్రహ్మంగారి వీధి సందుత్రిశూల్యూత్ ఆధ్వర్యంలో గత 5 సంవత్సరాలుగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా త్రిశూల్ యూత్ కమిటీ సభ్యులు రూ. 5 లక్షల వేయంతో అమ్మవారికి అత్యంత శోభాయమానంగా విశేష అలంకరణ గావించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ధూపదీప నైవేద్యాలు,ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో త్రిశూల్ యూత్ కమిటీ ప్రతినిధులు రావూరి సతీష్,మోకాళ్ళ సునీల్,బొడ్డుపల్లి బ్రహ్మాచారి,నల్లమోతు వెంకటేశ్వర్లు,ఆకారపు ప్రవీణ్,రాయల అన్వేష్ రావు,గుమ్మడోజు తిరుపతి,థౌడోజు మణికంఠ,థౌడోజు టింకు,రాయల సంపత్,భూక్యా అనిల్,జాటోత్ శ్రీరాం,కనగాల సతీష్,సాయి తేజ,తనీష్,కౌశిక్ మరియు ఇతర యూత్ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



గాంధీ తాండా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

- సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలి:
- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్...

(కళాశ్రీ గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్) అక్టోబర్ 17.

జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను రాయికల్ మండలం ధర్మజీపేట గాంధీ తాండాకు చెందిన నూతన లంబాడీ సంఘం పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన లంబాడీ సంఘం అధ్యక్షులు గుగ్లావత్ రాజు నాయక్ ఉపాధ్యక్షులు అజ్మీరా రాజేష్ పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అభినందించారు. గాంధీ తాండా అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, తాండాలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. తాండా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అవసరమైన సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సంధ్యారాణి సురేందర్ నాయక్, మాజీ సర్పంచ్ హరీష్, రాయికల్ మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజ శేఖర్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్, తట్లవాయి సర్పంచ్ మల్లేశం,భూక్యా తిరుపతి, అంగోత్ తిరుపతి వార్డు మెంబర్ , బాంద్రా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన, శ్రీ లలితా సహస్రనామ పూజలు నిర్వహించిన

బి జె ఎల్పి నేత ఏలేటి కవితమహేశ్వర్ రెడ్డి దంపతులు

నిర్మల్ అక్టోబర్ 17 (ప్రజాతీర్పు)



రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, సుభిక్షం కోసం, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి , వారి సతీమణి ఏలేటి కవితారెడ్డి లక్ష పుష్పార్చన, శ్రీ లలితా సహస్రనామ పూజలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రార్థిస్తూ నిర్మల్ జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సాగు చేసిన పంటలు సమృద్ధిగా పండి మంచి దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే జిల్లా, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, నిర్మల్ జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు.భక్తులకు వస్త్రాధానం,అన్నదానం చేశారు.ఈ పూజ కార్యక్రమం లో అధిక సంఖ్యలో స్వాములు,బి జె పి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సింగ్ రావుపల్లి, మర్వల్లిలో ధాన్యం కొనుగోళ్లు కేంద్రాలను కామారెడ్డి డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ప్రారంభించారు

నిజాంసాగర్, అక్టోబర్ 17(ప్రజా తీర్పు)



నిజాంసాగర్ మండలంలోని నర్సింగ్ రావుపల్లి, మర్వల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ప్రారంభించారు. అచ్చంపేట పీఏసీఎస్ చైర్మన్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోనున్నారు. పంట దిగుబడులను కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రజా పండరి, గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, గ్రామా రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎల్ నీ నో ప్రభావంతో ఏర్పడే నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత

జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్, అక్టోబర్ 17 (ప్రజా తీర్పు ప్రతినిధి):

ఎల్ నీ నో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, అధిక ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, భవిష్యత్తులో నీటి కొరతను అధిగమించేందుకు నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులు సూచించారు. శనివారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఎంపీడీవో లు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల తో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ..వీబీజీ రామ్ జీ ఉపాధి హామీ పథకం కింద నిబంధనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ఉపయోగపడే నీటి గుంతలు, ఫామ్ పాండ్స్, వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు వంటి పనులను చేపట్టడం ద్వారా వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చన్నారు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు సహజ వనరుల సంరక్షణకు తోడ్పడలన్నారు. ఎల్ నీ నో ప్రభావం వల్ల తలెత్తే వాతావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపుపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫామ్ పాండ్లతో బహుళ ప్రయోజనాలు

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

పాపన్నపేట/మెదక్, అక్టోబర్ 17 (ప్రజా తీర్పు ప్రతినిధి):

నిబంధనల ప్రకారం ఫామ్ పాండ్ల కమ్యూనిటీ సోక్ పిట్స్, నిర్మాణాలు చేపట్టాలి వీబీ--జీ రామ్ జీ పథకం కింద పనులు వేగవంతం చేయాలి శనివారం పాపన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో వి బి జి రామ్ ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..పంటల సాగుకు నీటి కొరత లేకుండా, వర్షపు నీటిని ఒడిసిపట్టి అవసరమైన సమయంలో పంటలకు వినియోగించుకునేందుకు చేపడుతున్న ఫామ్ పాండ్ల నిర్మాణశీ,సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం , జలసిరి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఫామ్ పాండ్ల నిర్మాణ పనులకు ఎక్కువ మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్ణీత లోతు, ఎత్తు, పొడవులతో ఫామ్ పాండ్ల నిర్మాణాలను చేపట్టాలని ఆదేశించారు. ప్రతి మండలంలో,ప్రతీ గ్రామ పంచాయతీ లో ఐదు ఫామ్ పాండ్ల చొప్పున ఎంపిక చేసి, వాటి నిర్మాణ పనులను క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. నిర్మాణ పనులకు ప్రతిరోజూ ఎంత మంది కూలీలు హాజరవుతున్నారు, వారికి ఎంత మేర కూలి చెల్లిస్తున్నారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీల హాజరును తప్పనిసరిగా నమోదు చేయడంతో పాటు, సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో భూగర్భ జల మట్టాల పెంపు, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ వీబీ--జీ రామ్ జీ పథకం కింద అవసరమైన పనులను గుర్తించి, చేపట్టాలని సూచించారు. చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మరమ్మతులు, ఇతర నీటి సంరక్షణ పనులకు సంబంధించి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో విష్ణువర్ధన్ , తాహసిల్దార్ సతీష్ గ్రామ మాజీ సర్పంచ్ జగన్ పాల్గొన్నారు.



కార్మికుల వేతన బకాయిలపై ఎల్.ఎస్.ఎన్.ఓబి కార్మికులు హెడ్ ఆఫీస్ ముందు ధర్నా

(పానకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి) అక్టోబర్ 17

కోయగూడెం ఎల్ ఎస్ ఎన్ ఓబి లో విధులు నిర్వహించిన కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలపై శనివారం సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐ ఎఫ్ టి యు) రాష్ట్ర అధ్యక్షుడు ఎండి రాశుద్దిన్ అధ్యక్షతన జరిగిన ధర్నాకార్యక్రమంలో జేఏసీ నాయకులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్రనాయకులు వంగ వెంకట్ సిఐటియు జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర, నాయకులు డి. ప్రసాద్ టి యు సి ఐ జిల్లా కార్యదర్శి ఎస్కే యాకూబ్ షావలి మాట్లాడుతూ సింగరేణి ఎల్ ఎస్ ఎన్ యాజమాన్యం నుండి కార్మికులకు రావాల్సిన బకాయిలను సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకొని ఇప్పించాలని కోరారు .దసరా పండగ సమీపిస్తున్న ఈ సందర్భంలో సింగరేణి యాజమాన్యం కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు .లేని యడల కార్మిక కుటుంబాలతో కలిసి హెడ్ ఆఫీస్ ముందు పికెటింగ్ నిర్వహిస్తామని తెలియజేశారు .కార్మికులకు వేతనం ఈపీఎఫ్ బోనస్ బకాయిలు సుమారు నాలుగు కోట్ల 50 లక్షలు రూపాయలు రావలసి ఉందని ఇట్టి బకాయిలపై ఎల్ ఎస్ యాజమాన్యం మొండి వైఖరిని విడనాడి తక్షణమే కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.ఎల్ ఎస్ ఎన్ కంపెనీ యాజమాన్యం కార్మికుల బకాయిల విషయంపై స్థానిక ఎమ్మెల్యే పోలీసు ఉన్నతాధికారులకు ఇచ్చిన హామీలను కూడా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలోసిఐటియు నాయకులు యస్ ఎ నఫీ,భూక్యారమేష్, ఏఐటీయూసీ నాయకులు దేవరకొండ శంకర్, జి. వీరస్వామి, కిష్టాపర్, ఐ ఎఫ్ టి యు నాయకులు ఎన్.సంజీవ్ టి యు సి ఐ నాయకులు నాయకులు పాయం వెంకన్న,పెద్ద బోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీలలితాత్రిపురసుందరీ దేవీ కాళ్లరాత్రిదేవి అలంకారంలో ఏడుపాయల వనదుర్గా దేవి

- నేత్రపర్వశీగా దేవీ శరన్నవ రాత్రుల ఉత్సవాలు అమ్మవారికి మహిళలు కుంకుమార్చన- విశేష పూజలు

మెదక్, అక్టోబర్ 17 (ప్రజా తీర్పు ప్రతినిధి):



శ్రీ ఏడుపాయల ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లో దేవీశరన్నవ రాత్రుల మహోత్సవాలు వైభవోపేతంగా అంగరంగవైభవంగా దుర్గానామస్మరణలతో భక్తితన్మయంతో మారుమ్రోగుతున్నాయి. దేవీశరన్నవ రాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఏడవరోజైన శనివారం ఉత్సవ మండపంలో శ్రీలలితాత్రిపురసుందరీ దేవి- కాళ్లరాత్రి దేవీ అమ్మవారు అలంకారంలో నారింజ పట్టువస్త్రంలో వనదుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. నేత్రపర్వశీగా దేవీ శరన్నవ రాత్రుల ఉత్సవాలు అమ్మవారికి మహిళలు కుంకుమార్చన- విశేష పూజలు శనివారం ఉదయం ప్రధాన ఆలయంలో శ్రీలలితాత్రిపురసుందరీ దేవి అలంకారంలో వన దుర్గాభవాని అమ్మ వారికి, గోకుల్ షెడ్ లోని ఉత్సవ మండపంలో శ్రీలలితాత్రిపురసుందరీ దేవి అలంకారంలో ఉన్న దుర్గాదేవి అమ్మవారికి వేద బ్రాహ్మణ పండితులు ఆర్ శంకర్ శర్మ, పార్టీవశర్మ, మురళీధర్ చారీ, రాజేశ్వర్ శర్మల ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన ఆలయంలో అర్చకులు పార్టీవశర్మ, ఉత్సవ మండపంలో వేద పండితులు, ప్రధాన అర్చకులు శంకర్ శర్మ, మురళీధర్ చారీ, రాజేశ్వర్ శర్మ లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన తదితరులు పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుండి భక్తుల పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు ను స్వీకరించారు. ఏడుపాయల్లో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. ఏడుపాయల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ వీరేశం ఆధ్వర్యంలో సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, రవికుమార్,తదితర సిబ్బంది చర్యలు తీసుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



డిసిసి అధ్యక్షుడిని కలిసిన మార్కెట్ కమిటీ పాలకవర్గం

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 17 ప్రజాతీర్పు


ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ చైర్మన్ మేడిపల్లి దేవానందం,వైస్ చైర్మన్ నంది కిషన్ తోపాటు మరో డైరెక్టర్ డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశారు రైతులకు పారదర్శక సేవలు అందించాలని డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గం శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ను సిరిసిల్లలో మర్యాదపూర్వకంగా కలిశారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానంద్,వైస్ చైర్మన్ నందికిషన్ డైరెక్టర్ గంగయ్యలను శాలువా కప్పి సన్మానించారు. రైతులకు ఉపయోగపడే విధంగా మార్కెట్ కమిటీ పాలకవర్గం పని చేయాలని అన్నారు.రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు.పంట చివరి దశలో ఉన్నందున విద్యుత్ సమస్యలు రాకుండా విద్యుత్ అధికారులతో మాట్లాడాలని కోరారు.అనంతరం నాలుగు రోజుల క్రితం డిసిసి అధ్యక్షులు కుమారుడైన ఆర్టిఏ మెంబర్ సంగీతం శ్రీనాథ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా పరామర్శించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, హరిదాస్ నగర్ సర్పంచ్ నాగరాజు నాయకులు షేక్ గౌస్,సద్ది లక్ష్మారెడ్డి గుండాటి రామ్ రెడ్డి.చెన్ని బాబు. గుర్రాల రాజిరెడ్డి, మహమ్మద్ లాలా ఉన్నారు.

పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ సభ్యుడుగా కృష్ణ హరి

ఎల్లారెడ్డిపేట, అక్టోబర్ 17 ప్రజాతీర్పు



ఎల్లారెడ్డిపేట మండల శాఖ నుండి పి ఆర్ టి యురాష్ట్ర కార్యవర్గానికి అసోసియేట్ ప్రెసిడెంట్లుగా గర్గుల కృష్ణ హరి,గోసిక మధు ఉపాధ్యక్షులుగా చేరాల ప్రభాకర్, ఎండి షఫీ కార్యదర్శిగా గోలి ఆనంద్ లు నల్గొండలో జరిగిన పిఆర్టియు సమావేశాల్లో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ 72457 సభ్యత్వాలతో పిఆర్టియుటిఎస్ అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం గా నిలిచిందని రాష్ట్ర నూతన కార్యవర్గానికి శు భాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల శాఖ నుండి నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కార్యవర్గ సభ్యులను జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి..శ్రీనివాసరావు, కిషన్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తేల్ల పూర్ణచందర్,బొల్లి భగవాన్ అభినందనలు తెలియజేశారు.



కనకదుర్గ ఆలయంలో కనుల విందుగా దసరా వేడుకలు

నిజాంపేట, అక్టోబర్ 17.ప్రజా తీర్పు

సర్కిల్ నిజాంపేట్ గ్రామంలో వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ నవరాత్రులు ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు సత్యం పంతులు వేద ప్రవచనాల మధ్య ఘనంగా దేవీ నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మూలా నక్షత్రం రోజున అమ్మవారిని రాజమాతంగి అవతారంలో దర్శనం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త కొలను శ్రీనివాస్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని చండీ హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సత్యం పంతులుగారు వారికి అమ్మవారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేసి వారిని ఆశీర్వదించారు. మూలా నక్షత్రం శుక్రవారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకొని తమ పిల్లలకు విద్యాభ్యాసం, కుంకుమార్చనలు చేశారు. ఈ సందర్భంగా కొలన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారు మూలా నక్షత్రం రోజున రాజమాతంగి అవతారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిస్తారని ఈరోజు అమ్మవారిని దర్శించుకుంటే తమ పిల్లలకు మంచి విద్య ఉద్యోగాలతో ఉన్నత స్థాయికి వెళ్తారన్నారు. అందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలన్నారు. సత్యం పంతులుగారు మాట్లాడుతూ దేవీ నవరాత్రులలో ముఖ్యమైనది మూలా నక్షత్రం అని ఆ నక్షత్రం శుక్రవారం రావడంతో అమ్మవారు రాజమాతంగి అవతారంలో దర్శనమిస్తుండడంతో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. మూలా నక్షత్రం రోజున బాల, బాలిక చిన్న పిల్లలకు విద్యాభ్యాసం చేపిస్తే వారికి మంచి విద్య, ఉద్యోగం రాజకీయంగా ఉన్నత స్థాయికి వెళ్తారని తెలపారు. ఈరోజు ఆలయంలో బాల బాలి,కలకు చిన్న పిల్లలకు విద్యాభ్యాసం అర్చకులచే చేయించామని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తమ పిల్లలకు విద్యాభ్యాసం చేయించుకున్నారని తెలిపారు. ఆలయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో అన్ని వసతులను సమకూర్చారన్నారు. ఈరోజు జరిగిన అన్న వితరణ మహోత్సవ కార్యక్రమానికి రాధాకృష్ణమూర్తి, లక్ష్మీ దంపతుల సహకరించారన్నారు. ప్రతిరోజు ఆలయ ఆవరణలో అన్న వితరణ కార్యక్రమం చేపడుతున్నామని ఎవరైనా ఈ కార్యక్రమంలో పాల్గొని అన్న వితరణ కార్యక్రమానికి సహకరించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరన్నారు. సాయంత్రం సమయంలో అమ్మవారి ఉత్సవాల లో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన లక్ష్మి దేవి ఉత్సవ ఊరేగింపుకు, శుక్రవారం రోజు సరస్వతి అమ్మవారి ఉత్సవాలకు శ్రీనివాసరాజు సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అమ్మవారి కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రతి కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు.

వ్యాపార సముదాయాల్లో పార్కింగ్ తప్పనిసరి

- రోడ్లపై పశువులు వదిలితే యజమానులకు జరిమానా
- ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 17 (ప్రజాతీర్పు):



పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. వ్యాపార సముదాయాలకు తప్పనిసరిగా పార్కింగ్ సదుపాయం ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాల్లో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్లపై ఆక్రమణలు, పశువుల సంచారం, ఇసుక అక్రమ రవాణా తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. పార్కింగ్ సదుపాయం లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపార సముదాయాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై పశువులను వదిలే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పశువుల కారణంగా ప్రమాదాలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే యజమానులకు జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే పశువులను స్వాధీనం చేసుకోవాలని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు, మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి తొలగించాలని అధికారులను ఆదేశించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను 'బ్లాక్ స్పాట్లు'గా గుర్తించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు అవసరమైన హెచ్చరిక బోర్డులు, ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట నిబంధనలకు విరుద్ధంగా, ప్రమాదకరంగా భారీ వాహనాలను నిలిపే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల నిర్మాణ పనులకు కూడా నిబంధనలకు అనుగుణంగానే ఇసుకను వినియోగించాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీలు (వీడీసీ) ఇసుక వేలం నిర్వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. చట్టవ్యతిరేకకార్యకలాపాలకు పాల్పడే వీడీసీలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం: ఎస్పీ జానకి షర్మిల

జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివిధ కేసుల్లో బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయ, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో గంజాయి సాగు, విక్రయాలను అరికడుతున్నామని, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ తెలిపారు. అనంతరం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'భూభారతి', 'సీఎం ప్రజావాణి'లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్రా రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట అక్టోబర్ 17 ప్రజా తీర్పు ప్రతినిధి కృష్ణ

ఖానాపురం మండలం ధర్మారావుపేట గ్రామంలో మహిళా సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించి, స్వయం సమృద్ధి దిశగా ముందుకు సాగేందుకు మహిళా సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు సంఘటితంగా ఉండి, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత లభించడంతో పాటు, వారి కుటుంబాల అభివృద్ధికి కూడా మార్గం సుగమమవుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, మహిళా సంఘాల కార్యకలాపాలకు అనువైన భవనాలను నిర్మించడం ద్వారా వారి సమావేశాలకు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని అన్నారు. గ్రామాల అభివృద్ధితో



పాటు మహిళల సంక్షేమానికి కూడా ప్రాధాన్యతనిస్తూ అవసరమైన అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



బీర్పూర్, సారంగాపూర్ మండలాల్లో దుర్గాదేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన Dr. బోగ శ్రావణి ప్రవీణ్

(కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్)అక్టోబర్ 17

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బీర్పూర్, సారంగాపూర్ మండలాల్లో ఏర్పాటు చేసిన పలు దుర్గాదేవి మండపాలను బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ ణతీ. బోగ శ్రావణి ప్రవీణ్ సందర్శించి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలు, ఐకమత్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, సమాజంలో సోదరభావం, మహిళల పట్ల గౌరవం, ధర్మ పరిరక్షణ వంటి విలువలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య, జిల్లా కార్యదర్శి పాత రమేష్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నరపాక అశోక్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు కంచర్ల నరేష్, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య సుందర్ నాయక్, జిల్లా మత్స్యకార సెల్ కన్వీనర్ బద్దెల గంగరాజు, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు ఘర్షకుర్తి శిల్పా-రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు మహేష్ యాదవ్, శ్రీపతి రమేష్, కంచర్ల శివకుమార్, నాగరాజు, కంచర్ల వేణు, పెండ్యాల ప్రతాప్ తదితర మండల ముఖ్య నాయకులు, బీజేపీ కార్యకర్తలు, భవానీ దీక్ష స్వాములు, మహిళలు పాల్గొన్నారు.



శిల్పారామంలో బతుకమ్మ సంబరాలు...

శేరిలింగంపల్లి, అక్టోబరు 17 ప్రజా తీర్పు

శిల్పారామంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి,శనివారం సాయంత్రం సందర్శకులతో కలిసి బతుకమ్మ ఆట ఆడుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం నుండి విచ్చేసిన శ్రీమతి దీపికా బృందం కర్ణాటక గాత్ర కచేరీ అలరించింది. గణపతి తాళం, అఖిల లోక పావని, శ్రీ లలిత, నవదుర్గ, తీరు తీరు జవరాల తదితర కీర్తనలను ఆలపించారు. వర్ణ డాన్స్ అకాడమీ నాట్య గురువులు శ్రీమతి స్మిత మాధవ్, శ్రీమతి భార్గవి శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనలో మాంటెక్, జతిస్వరం, శారదే, క్షీరాబ్ధి కన్యకకు, అష్టలక్ష్మి అంశాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో శ్రీమతి అమృత, కుమారి ఇషా, యశస్విని, గీత హన్సిక, గీన కమాలిక, సహన, రిషికలు పాల్గొని మెప్పించారు. అలాగే ట్రైబల్ మేళాలో ఆదివాసీలు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

జిల్లా ప్రజలకు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు..

మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట అక్టోబర్ 17 ప్రజా తీర్పు



సిద్దిపేట జిల్లా ప్రజలకు ఆడపడుచులకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు... ఈ సందర్భంగా మాట్లాడుతు... పెత్తర అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమై, తొమ్మిది రోజుల పాటు తీరొక్క పూలతో ప్రకృతిని ఆరాధిస్తూ, ఆడబిడ్డల ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే బతుకమ్మ పండుగ మన తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు, ఆత్మగౌరవానికి నిలువెత్తు నిదర్శనమన్నారు...ప్రకృతితో మమేకమై, పూలనే దేవతగా కొలుస్తూ, గౌరమ్మను భక్తిశ్రద్ధలతో పూజించే ఈ బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఐక్యతకు, అనుబంధాలకు, ఆత్మీయతకు అద్దం పడుతుందని చెప్పారు.. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆడబిడ్డలందరూ ఒకచోట చేరి, బతుకమ్మ పాటలు పాడుతూ జరుపుకునే ఈ పండుగ మన తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతుందని....బతుకమ్మ అంటే కేవలం పూల పండుగ మాత్రమే కాదు.. మన తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు, కుటుంబ అనుబంధాలకు, సామాజిక ఐక్యతకు ప్రతీక అని..తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి, మన సంస్కృతికి మరింత ప్రాధాన్యం కల్పించిందని చెప్పారు.. ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో, జరుపుకునే బతుకమ్మ పండుగ నేడు దేశ విదేశాల్లో ఘనంగా జరుపుకునే స్థాయికి చేరుకుందని...ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలంగాణ బిడ్డలు తమ మూలాలను, సంస్కృతిని, సంప్రదాయాలను మరచిపోకుండా బతుకమ్మ పండుగను ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారన్నారు..దేశ విదేశాల్లో బతుకమ్మ పాటలు మారుమోగుతుంటే, తెలంగాణ సంస్కృతి వైభవం ప్రపంచానికి చాటిచెప్పబడుతోందన్నార. తొమ్మిది రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ వేడుకల్లో చివరి రోజైన సద్దుల బతుకమ్మ సందర్భంగా గౌరమ్మ ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని, తెలంగాణ ఆడబిడ్డలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నన్నారు..

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పాత సామగ్రి వేలం..

రూ.7.30 లక్షలకు దక్కించుకున్న వ్యాపారి

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వినియోగానికి పనికిరాని పాత సామగ్రి విక్రయానికి శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ వేలంపాటలో సుమారు 40 మంది వ్యాపారులు పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు నేతృత్వంలోని కమిటీ ఈ వేలంపాటను నిర్వహించింది. పారదర్శకంగా నిర్వహించిన వేలంలో వరంగల్ ఆటోనగర్‌కు చెందిన పటేల్ ఖాన్ పాత సామగ్రిని రూ.7,30,000కు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) సురేష్, ఏసీపీ (ఏఆర్) సురేంద్ర, అంతయ్య, ఆర్ఐ స్పర్జన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్టీసీ గుర్తింపు సంఘం నాయకులు

- సంబరాలు చేసుకున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

నర్సంపేట అక్టోబర్ 17 ప్రజా తీర్పు ప్రతినిధి కృష్ణ



నర్సంపేట బస్సు డిపో ఆర్టీసీ ఉద్యోగ ,కార్మికుల సంఘాల ఎన్నికల్లో , ఈ యు. ఎం ఎన్ యు. టి ఎం యు. టి జె యం యు కూటమి గెలుపొందగా డిపోలో సంబరాలు చేసుకొని అనంతరం నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు

ఈ సందర్భంగా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆర్టీసీ ఉద్యోగులకు దిశా నిర్దేశం చేస్తూ కార్మికులంతా ఐక్యంగా ఉండాలని వర్గాలు, యూనియన్లు ఎన్నికల వరకే నని తర్వాత కార్మికులు ఉద్యోగులు ఐక్యతతో డిపో అభివృద్ధికి ఆర్టీసీ సంస్థ బలోపేతానికి కృషి చేయాలని, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ల అధ్యక్షులు వేముల సాంబయ్య గౌడ్, డిపో సెక్రెటరీ అధ్యక్షులు కూటమి అధ్యక్షులు పిఎన్ రావు, జీకే స్వామి, బండి బాబు, గోలకొండ వేణు, శ్రీలత, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దండెం రతన్ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు వేముల సారంగంగౌడ్, ఎన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షులు కటారి ఉత్తంకుమార్ , పట్టణ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,29వ డివిజన్ కార్యదర్శి దోమటి కుమారస్వామి, ఆర్టీసీ ఉద్యోగులు , బత్తిని సాంబయ్య, నాగిశెట్టిప్రవీణ్, గుండెబోయిన సాగర్, రాంబాబు, ప్రసాద్, ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు

ఎస్సై శ్రీకాంత్ ను సస్పెండ్ చేయాలి

- బాధితులకు నష్టపరిహారం అందించాలి
- టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు సుమలత శర్మ

ఎల్లారెడ్డిపేట అక్టోబర్ 17 ప్రజా తీర్పు



గంభీరావుపేట ఎస్సైగా పనిచేసిన శ్రీకాంత్ ను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని టిఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షురాలు సంకేపల్లి సుమలత శర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అన్యాయాలు అరాచకాలను వెలికి తీసి ప్రజలకు చేరవేసే పాత్రికేయులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అమానుషమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు అంతేకాకుండా గతంలో ఎస్సై శ్రీకాంత్ ఏసీబీకి పట్టుబడిన ఉదంతాన్ని ఆమె గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఖాకీలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని, పాత్రికేయులు ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభంగా ఉన్న విషయాన్ని పోలీసు యంత్రాంగం గుర్తించాలని కోరారు. వాస్తవాలు రాసే విలేకరులపై కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. కలానికి సంకెళ్లు వేసే విధంగా వ్యవహరించే పోలీస్ లను చట్టపరంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి 10 లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించి మెరుగైన వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేశారు.



అగ్గిమల్లలో 14 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

- సర్పంచ్ కంకణాల వసంత లక్ష్మణ్

(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) అక్టోబర్ 17

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలం అగ్గిమల్ల గ్రామంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) చెక్కులను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ కంకణాల వసంత లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 14 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4 లక్షల 30 వేల విలువైన చెక్కులను అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు, గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి తిరుపతి, తడవే నరేష్, ఉపసర్పంచ్, గ్రామ శాఖ అధ్యక్షుడు సట్ట ఎల్లయ్య, పందిరి రాజన్న, ఎండీ రఫీ, శ్యామల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం.. ఆటో డ్రైవర్ బాబు!

- బంగారం, నగదుతో కూడిన బ్యాగును బాధితురాలికి అప్పగింత

కరీంనగర్ టౌన్, అక్టోబరు 17 (ప్రజా మలుపు):

ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మరిచిపోయిన హ్యాండ్ బ్యాగును అందులోని 8 గ్రాముల బంగారం, రూ.12 వేల నగదుతో సహా తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ అవుదుర్తి బాబును కరీంనగర్ టూ టౌన్ సీఐ సృజన్ రెడ్డి అభినందించి సన్మానించారు. విలువైన వస్తువులు దొరికినప్పుడు వాటిని యజమానులకు తిరిగి అందించి సమాజానికి ఆదర్శంగా నిలిచిన బాబు నిజాయితీని పోలీసులు ప్రశంసించారు. ఈ నెల 15వ తేదీ రాత్రి చెన్నై షాపింగ్ మాల్ వద్ద ఆటో ఎక్కిన ఓ మహిళ విద్యానగర్‌లో దిగే సమయంలో తన హ్యాండ్ బ్యాగును ఆటోలోనే మరిచిపోయారు. అందులో బంగారం, నగదు ఉన్నట్లు గుర్తించి బ్యాగు కోసం వివిధ గ్రూపుల్లో సమాచారం పంచుకున్నారు. ఈ సందేశాన్ని గమనించిన వావిలాలపల్లి ఆటో స్టాండ్‌కు చెందిన డ్రైవర్ అవుదుర్తి బాబు తన ఆటోలోనే బ్యాగు ఉన్నట్లు గుర్తించి ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డికి సమాచారం అందించారు. అనంతరం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సృజన్ రెడ్డి సమక్షంలో ఎస్సై శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ బషీర్, కానిస్టేబుల్ హరీష్ రెడ్డి, ఆటో కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బ్యాగును బాధితురాలికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ సృజన్ రెడ్డి మాట్లాడుతూ.. అవుదుర్తి బాబు నిజాయితీ, బాధ్యతాయుతమైన ప్రవర్తన అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఇలాంటి మంచి పనులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచిస్తూ ఆటో డ్రైవర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బండారి సంపత్ పటేల్, ఉపాధ్యక్షులు కొత్తూరు సత్యనారాయణ, ఇరవేణి కుమార్, సహాయ కార్యదర్శి వాల్క రమేష్, కార్యవర్గ సభ్యుడు కూర్మాచలం వేణుమాధవ్, వావిలాలపల్లి ఆటో స్టాండ్ అధ్యక్షుడు నేదునూరి రవి తదితరులు పాల్గొన్నారు.

కైలాసం సేవలు మరువలేనివి

హుస్నాబాద్ అక్టోబర్ 17 రవీందర్ ప్రజా తీర్పు



ప్రభుత్వ ఉద్యోగాన్ని నిబద్ధతతో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్న కైలాసం సేవలు మరువలేనివని ఎంపీడీవో రామ్మోహనాచారి అన్నారు. ఇటీవల స్వర్గస్తులైన సూపరిండెంట్ మరియు ఇన్చార్జ్ ఎంపీడీవో అయిత కైలాసంను స్మరించుకుంటూ శనివారం చిగురుమామిడి మండల పరిషత్ కార్యాలయములో కైలాసం చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాలలో పనిచేసిన విధానం గురించి మాట్లాడారు. అలాగే చిగురుమామిడి మండల ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామ్మోహన చారి మాట్లాడుతూ, ఒక వృత్తిపట్ల నిబద్ధతగల వ్యక్తిని కోల్పోవడం బాధాకరమన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని తాము చేసే ఉద్యోగం పట్ల అంకితభావంతో పనిచేయడం నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహనాచారి, ఎంపిఓ కిరణ్ కుమార్, ఏపీవో రాజు, పంచాయతి కార్యదర్శి, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను పరిశీలించిన పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్

సిద్దిపేట అక్టోబర్ 17 ప్రజా తీర్పు

బతుకమ్మ సంబరాలు, దసరా పండుగ నేపథ్యంలో సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు, రూబీ నెక్లెస్ రోడ్డు ప్రాంతాల్లో పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కోమటి చెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యాలు, పోలీసు బందోబస్తు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పండుగకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. కోమటి చెరువు పై ఏర్పాటు చేసినటువంటి లైటింగ్ పనులు బాగున్నాయంటూ మున్సిపల్ అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవీందర్ రెడ్డి, మున్సిపల్ ఆర్వో బాలకృష్ణ, ఏఈలు పృథ్వి, జమిల్, వన్‌టౌన్ సీఐ మహేష్ రెడ్డి,ట్రాఫిక్ సిఐ,సానిటరీ ఇన్స్పెక్టర్లు,మహేష్ శివకుమార్,మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో అచలాపూర్ విద్యార్థినికి కాంస్య పతకం

(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజా తీర్పు- తాండూర్ మండలం రిపోర్టర్) అక్టోబర్ 17



ఎస్‌జీఎఫ్ అండర్--17 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో అచలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె. శ్రీవల్లి కాంస్య పతకం సాధించింది. ఈ విషయాన్ని పాఠశాల పీడీ ఏ. నాంబవ్యూరి తెలిపారు.పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అక్టోబర్ 14 నుంచి 16వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని మైత్రి గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని కె. శ్రీవల్లి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. ఉమాదేవి, ఏఏపీసీ చైర్మన్ చిలకమ్మ, సర్పంచ్ మారిశెట్టి స్రవంతి శ్రీనివాస్, ఉపసర్పంచ్ గట్టు సంతోష్, వార్డు సభ్యుడు పాపయ్య, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయ బృందం శ్రీవల్లిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

టీపీసీసీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన నీలం..

- రానున్న గ్రాడ్యుయేట్ ఎన్నికలపై పలు కీలక సూచనలు చేసిన టీపీసీసీ..

పఠాన్ చెరు అక్టోబర్ 17 ప్రజా తీర్పు



తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని శనివారం నార్సింగిలోని ఆయన నివాసంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు, ఈ సందర్భంగా మహేష్ గౌడ్ గారు మాట్లాడుతూ రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీల ఎన్నికలలో ఓటర్ నమోదు ప్రక్రియ తదితర అంశాలపై కీలక సూచనలు చేసి కష్టపడి పనిచేయాల్సిందిగా సూచించారు, ఈ సందర్భంగా నీలం మధు టీపీసీసీకి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రశ్నించడమే కాదు ప్రజాసేవలో కూడా ముందు

ప్రెస్ క్లబ్ విలేకరులు అభినందించిన గ్రామస్తులు



(వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) అక్టోబర్ 17.

మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో నిత్యం పలు సమస్యలపై వార్తలు సేకరించడంతోపాటు వాటిని ప్రచురించి అధికారులు దృష్టికి తీసుకెళ్లడంలో నిత్యం పోరాడుతూనే ఉంటారు. ఇలాంటి క్రమంలో మండల కేంద్రంలోని జాతీయ రహదారి 44 వెళ్లే సర్వీస్ రోడ్లు భారీ గొయ్యి ఉండడంతో పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన స్పందించకపోవడంతో పత్రికా విలేకరులు ఏర్పుల భూపాల్, గుడ్డి విట్టల్ గ్రామస్తులైన జెసిపి యజమాని గొల్ల మల్లేష్ సమస్య వివరించిన వెంటనే మానవత దుప్రదంతో ఉచితంగా ఆ గుంతను పూడ్చారు. గతంలో ఇక్కడ చాలా ప్రమాదాలు జరిగాయని గుంతను పూడ్చడంతో పూర్తిగా సమస్య పరిష్కారం కవడంతో గ్రామస్తులు విలేకరులను జె సి బి యజమానిని అభినందించారు. రాబోవు కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తామని ప్రెస్ క్లబ్ విలేకరులు తెలిపారు.

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

- అందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల) అక్టోబర్ -17



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బతుకమ్మ సంబురాలు శనివారం వైభవంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో. సమీకృత కార్యాలయాల సముదాయంలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ సంబురాలు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, బతుకమ్మ పాటలకు మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి ఆడిపాడారు. అందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు కలెక్టర్ తెలియజేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మలు తీర్చిదిద్దారు. మొదటి బహుమతి జిల్లా వ్యవసాయ శాఖకు రాగా, రెండో బహుమతి రెవెన్యూ శాఖకు, మూడో బహుమతి శాఖకు ఎం పీ పీ ఎస్ తంగళ్లపల్లి కి వచ్చింది. ఈ సందర్భంగా విజేతరకు జిల్లా కలెక్టర్ బహుమతులు అందజేసి.. అభినందించారు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులు, సిబ్బంది ఉత్సాహంగా బతుకమ్మను అందంగా తీర్చిదిద్ది ఆడిపాడారని కొనియాడారు. వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించామని, ఆదివారం సిరిసిల్లలో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నామని వివరించారు. ముందస్తుగా అందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, వేములవాడ ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, వివిధ శాఖల జిల్లా అధికారులు అష్జల్ బేగం, సౌజన్య, ఏంజెలా ఆల్ఫ్రెడ్, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

శ్రామికుల ఇంట 'దసరా' వెలుగులు: 450 మంది కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ

- సొంత కుటుంబసభ్యుల్లా ఆదరించిన మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్

పటాన్చెరు అక్టోబర్ 17 ప్రజా తీర్పు



నిత్యం ప్రజారోగ్యం, తాగునీటి సరఫరా కోసం శ్రమిస్తున్న శ్రామికుల ఇళ్లలో పండుగ వెలుగులు నింపాలన్న సంకల్పంతో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ దసరా పండుగను పురస్కరించుకుని ఆదర్శనీయ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. అమీన్‌పూర్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ (వాటర్ బోర్డు) కార్మికులు సుమారు 450 మందికి తన నివాసంలో కుటుంబ సమేతంగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. మహిళా కార్మికులకు చీరలు, పురుషులకు షర్టులు అందజేసి ఆత్మీయంగా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నందారం నరసింహా గౌడ్ మాట్లాడుతూ.. ఎండనక, వాననక నిత్యం రహదారులను శుభ్రపరుస్తూ, తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా శ్రమిస్తున్న కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. తెలంగాణలో పెద్ద పండుగైన విజయదశమిని వారు కూడా తమ కుటుంబాలతో కలిసి ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలనే ఉద్దేశంతోనే వారిని సొంత కుటుంబ సభ్యులుగా భావించి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్మికుల మోములో చిరునవ్వు చూడటమే తమ కుటుంబానికి నిజమైన పండుగ సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల సేవలో ఉండే తమ శ్రమను గుర్తించి, పండుగ వేళ పెద్ద దిక్కుగా నిలిచి గౌరవించినందుకు నందారం నరసింహా గౌడ్ కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్మికుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తున్న నరసింహా గౌడ్ కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, భవిష్యత్తులో వారు మరింత ఉన్నత పదవులు అధిష్టించి ప్రజాసేవలో ముందంజలో ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎన్ జి యువసేన సభ్యులు ఇంద్రేశం ప్రకాష్, ముదిరాజ్, ఇంద్రేశం జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నందారం శ్రీనివాస్ గౌడ్, దాసు యాదవ్, శేఖర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, మల్లేష్, భాస్కర్ రెడ్డి, స్థానిక ప్రముఖులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్ద ఎక్లారాలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

జుక్కల్ /అక్టోబర్ 17(ప్రజా తీర్పు):

కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని పెద్ద ఎక్లారా గ్రామంలో శనివారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆడపడుచులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమవర్ మహేష్, ఉపసర్పంచ్ సంగ్రామ్ పటేల్ పాల్గొని మహిళలను ప్రోత్సహించారు. బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఆడపడుచులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.2,100, రెండో బహుమతిగా రూ.1,100 అందించి మహిళలను అభినందించారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ పండుగను ఐకమత్యంతో నిర్వహించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.



గంజాయి అక్రమ రవాణా చేస్తున్నముగ్గురు నిందితులు అరెస్ట్

- రూ.5 లక్షల విలువైన 10.165 కిలోల ఎండు గంజాయి స్వాధీనం

ప్రజాతీర్పు తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో

ఒడిశా నుంచి గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 10.165 కిలోల ఎండు గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. అక్టోబర్ 17న ఉదయం 10:50 గంటల సమయంలో కేసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్యోతిరావు ఫూలే సెంటర్ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, రెండు బ్యాగులు, ఒక చేతి సంచిలో బ్రౌన్ రంగు టేపుతో ప్యాక్ చేసిన ఎండు గంజాయి లభించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో నిందితులు ఒడిశా రాష్ట్రానికి వెళ్లి గంజాయిని కొనుగోలు చేసి, చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ కేసులో హైదరాబాద్‌లోని ఓల్డ్ అల్వాల్ హరిజనవాడకు చెందిన కుమ్మరి నితిన్ (23), మేడ్చల్ జిల్లా షామీర్‌పేట మండలం ఉప్పరపల్లికి చెందిన తాండ్ర బాలకృష్ణ (21), జేజల అభినాష్ (21)లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.

ప్రమాదకర శబ్ద పరికరాలు విక్రయిస్తే కఠిన చర్యలు

హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రమాదకరమైన శబ్దాలు చేసే పీకలు, ఇతర పరికరాలను విక్రయించరాదని హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి పరికరాలను విక్రయించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నపిల్లలు, యువత ఇలాంటి పరికరాలను ఉపయోగించకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, శబ్ద కాలుష్యానికి దూరంగా ఉంటూ ఇతరులకు ఇబ్బంది కలగకుండా, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పండుగలను ప్రశాంతంగా, ఆనందంగా జరుపుకోవాలని సూచించారు.

మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- పోలీసు కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

సంప్రదాయ దుస్తుల్లో మహిళల సందడి

వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలు, కోలాటాలతో పోలీస్ కార్యాలయ ప్రాంగణం సందడిగా మారింది. మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ వేడుకలను వైభవంగా నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి వేడుకలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిరంతరం నిమగ్నమయ్యే పోలీస్ సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పండుగను జరుపుకోవడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందంగా బతుకమ్మలను పేర్చిన మహిళలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఆర్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

గ్రామాల్లో భూముల రీ సర్వేతో స్పష్టమైన సరిహద్దులు

- సహాయ వ్యవసాయ సంచాలకులు కిషన్ రావు

హుస్నాబాద్ అక్టోబర్ 17 రవీందర్ ప్రజా తీర్పు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వేతో స్పష్టమైన సరిహద్దులు నిర్ధారణ చేయబడుతున్నాయని కరీంనగర్ సహాయ వ్యవసాయ సంచాలకులు కిషన్ రావు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముదిమాణిక్యం, రామంచ గ్రామాల్లో సంబంధిత సర్పంచ్ రమేష్, కిషన్ రెడ్డి అధ్యక్షత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఏడి కిషన్ రావు మాట్లాడుతూ, ముదిమాణిక్యశీ, రామంచ గ్రామాల్లో మొదటగా గ్రామ సరిహద్దులను ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూములను, రాస్తాలను, కెనాల్ ఇతర అన్ని శాఖల ఆధీనములో ఉన్న ప్రభుత్వ భూములను గ్రామ ఆబాది భూముల హద్దులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి రైతుకు సంబంధించి వారి ఆదీనంలో కాస్తులో కలిగి ఉన్న భూములను హద్దుల రైతుల సమక్షంలో అక్షాంశాలు, రేకాంశాలతో కూడిన కొలతను చేసి వారికి చెందిన భూమి వివరాలు, ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ నెంబర్ లను సేకరించి వారికి చెందిన భూమికి ఒక తాత్కాలిక నెంబర్ ను కేటాయించడం జరిగిందన్నారు. ఒక రైతు తనకు ఉండబడిన భూమి రికార్డులకు మోకాపై కాస్తులో గల భూమి విస్తీర్ణం లో ఏవైనా తేడాలు ఉన్నట్లయితే అట్టి వారికి నోటీసులు జారిచేయబడతాయని, నోటీసు అందిన వారు వారి వద్దగల భూమికి సంబంధించి టైటిల్ పత్రాలతో 60 రోజుల లోపు అప్పీల్ చేసుకోవచ్చని , ఇట్టి భూముల రిసర్వే వల్ల భూ తగాదాలు తగ్గడంతో పాటు భవిష్యత్తులో ఎవరైనా భూమి ఆక్రమణలకు పాల్పడితే సులభంగా పసిగట్టవచ్చని అన్నారు. అందువలన ప్రతి రైతు తమ భూమి సర్వే కు వచ్చే సిబ్బందికి అందుబాటులో ఉండి సర్వే వివరాలను వెల్లడించి ఎలాంటి తప్పులకు, అపోహలకు తావులేకుండా సరి చూసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో ఏదైనా రైతు భూమిని విక్రయించవలసి వస్తే సర్వే మ్యాప్ ను జతపరచవలసి ఉంటుందని, ప్రతి రైతుకు భూ ఆధార్ కార్డులను జారీ చేయడం జరుగునని, ఇట్టి భూ ఆధార్ ద్వారానే అన్ని భూ లావాదేవీలు, జరుగునని అందువలన ప్రతి రైతు తన ఆధీనములో ఉండబడిన భూమి సక్రమంగా సిబ్బందికి చూపించి సర్వే సజావుగా సాగేలా రైతులు సహకరించి మూడు నెలల లోపు పూర్తి సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం చిగురుమామిడి తహశీల్దార్ మాట్లాడుతూ, భూ రీ సర్వే వల్ల రైతులు భూముల సర్వే గురించి కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తప్పడం తో పాటు, మొఖా వివాదాలు పూర్తిగా సమసిపోతాయని, అందుకు రైతులు సర్వే టీం కు సహాయ సహకారాలు అందించి డిజిటల్ మ్యాప్ తయారీకి సహకరించాలని కోరారు. సర్పంచ్ లు మాట్లాడుతూ, మా గ్రామాలను ముందుగా ఎంపిక చేసినందుకు అధికారులకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. రైతులను ఇట్టి సర్వే గురించి ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చి సర్వే పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కోరారు. అనంతరం రైతులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానం చెబుతూ సందేహాలను తీర్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కనకయ్య , డి ఐ శ్రీనివాస్, అగ్రికల్చర్ అధికారులు పున్నంచందర్, సర్పంచులు రమేష్, కిషన్ రెడ్డి, మండల సర్వేయర్ మురళీ కృష్ణ.ఆర్. ఐ రజనీకాంత్ రెడ్డి, ఏ ఈ ఓ ప్రణయ్, జిపిఓ లు, రైతులు లక్ష్మారెడ్డి, తాజోద్దీన్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు పిండి వంటలను అందించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్

నర్సంపేట అక్టోబర్ 17 ప్రజా తీర్పు ప్రతినిధి కృష్ణ

త్వరలో రానున్న దసరా పండగ సందర్భంగా శనివారం నర్సంపేటలోని సంజీవని ఆశ్రమంకు వెళ్లి చిన్నారులకు తను చేతితో స్వయంగా చేసిన పిండి వంటలను అందించిన నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ ఈ కార్యక్రమంలో ధర్మశాస్త్ర సేవా కమిటీ శ్రీరాం కిరణ్, కోశాధికారి గండు నవీన్, ప్రధాన కార్యదర్శి మాలె రాజేష్ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బాదం రంజిత్, అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షులు సైప సురేష్, కోదండ రామాలయం ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపన్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు..

ఉర్సు రంగాలీల మైదానంలో దసరా ఉత్సవాలు..

ట్రై సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు...

ప్రజాతీర్పు, తెలంగాణ స్టేట్ క్రైమ్ బ్యూరో



ఉర్సు రంగాలీల మైదానంలో అక్టోబర్ 20న నిర్వహించనున్న దసరా ఉత్సవాల నేపథ్యంలో వరంగల్ ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించనున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. అక్టోబర్ 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి అక్టోబర్ 21వ తేదీ తెల్లవారుజామున 3 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. ఖమ్మం నుంచి వరంగల్ మీదుగా కరీంనగర్, హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలు ఫున్నెలు క్రాస్ నుంచి ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్లాలి. కరీంనగర్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కేయూసీ, పెద్దమ్మగడ్డ, హనుమాన్ జంక్షన్, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, తెలంగాణ జంక్షన్, ఫోర్ట్ రోడ్ జంక్షన్ మీదుగా వెళ్లాలని సూచించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు మీదుగా ఫున్నెలు క్రాస్‌కు చేరుకుని వెళ్లాలి. ఉర్సు గుట్టకు వచ్చే భక్తులు, సందర్శకుల వాహనాల కోసం వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. హంటర్ రోడ్డు వైపు నుంచి వచ్చే వాహనాలను కొలంబో ఆసుపత్రి సమీపంలో, బీఆర్ నగర్ ఎదురుగా ఉన్న గానుగ ఆయిల్ పాయింట్ వద్ద, ఆకుతోట ఫంక్షన్ హాల్, నాని గార్డెన్, జేఎస్ఎం స్కూల్ వద్ద పార్కింగ్ చేసుకోవచ్చు. కడిపికొండ వైపు నుంచి వచ్చే వాహనాలకు భారత్ పెట్రోల్ పంపు సమీపంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆర్టీఓ జంక్షన్ నుంచి వచ్చే వాహనాలు లవ్లీ ఫంక్షన్ హాల్ ఓపెన్ ప్లేస్, తాళ్ల పద్మావతి కళాశాల సమీపంలో పార్కింగ్ చేయాలి. కరీమాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు భీరన్న గుడి వద్ద పార్కింగ్ చేసుకోవాలి. ఈ సందర్భంగా దసరా ఉత్సవాలకు వచ్చే ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలను గమనించి, పోలీసుల సూచనలు పాటించాలని కమిషనర్ ఎన్. శ్వేత కోరారు. ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు నిర్దేశించిన మార్గాల్లో ప్రయాణిస్తూ, కేటాయించిన పార్కింగ్ స్థలాలను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.



ఏపూరి ఎర్ర సూర్యుడు. కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్

- 18 వ వర్ధంతి సందర్భంగా ఘనమైన నివాళులు
- ఎం సిపిఐ యూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న.

(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) అక్టోబర్ 17

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు. ఏపూరి ఎర్ర సూర్యుడు. ఎం సిపిఐ వ్యవస్థాపకులు. అసెంబ్లీ టైగర్ అమరజీవి కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ ఎక్స్ ఎమ్మెల్యే గారి 18వ వర్ధంతి ఈరోజు కామ్రేడ్ ఎస్కే నజీర్ అధ్యక్షతన జిల్లా కేంద్రంలో అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి మాజీ ఎంపీ గారి విగ్రహం వద్ద నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వరికుప్పల వెంకన్న మాట్లాడుతూ ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం పోరాడి ఆ పోరాటంలో భీమిరెడ్డి నరసింహారెడ్డి గారితో కలిసి పది లక్షల ఎకరాల భూమి పేద ప్రజలకు పంచిన చరిత్ర ఓంకార్ గారిది ఐదుసార్లు నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో రాష్ట్ర ప్రజల సమస్యల గురించి రెండున్నర గంటలు అనార్దళంగా మాట్లాడి అసెంబ్లీ టైగర్ గా పేరు తెచ్చుకున్నారని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఆదివాసుల హక్కుల కోసం అనగారిన కులాల కోసం అనేక పోరాటాలు నిర్వహించి తాను మరణించేంతవరకు సామాజిక న్యాయం కమ్యూనిస్టుల ఐక్యత కోసం కృషి చేశారని వెంకన్న అన్నారు. ఈ కార్యక్రమములో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లింగంపల్లి పంచాయతీ రాజ్ చందుపట్ల పవన్ కళ్యాణ్ నాయకులు గోపగాని లింగయ్య వైభవ్ బండి శబరి లక్ష్మణ్ శ్రీను రాములు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆడపడుచులకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హుస్నాబాద్ అక్టోబర్ 17 రవీందర్ ప్రజా తీర్పు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని రాష్ట్రంలోని ఆడపడుచులందరికీ రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన రాష్ట్ర అస్తిత్వానికి, పూల పండుగ ప్రత్యేకతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ 9 రోజుల పాటు పూలతో పూజించి బతుకమ్మ ఆట పాటలతో మహిళలు ఐకమత్యంతో జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని తెలిపారు.ఈ సద్దుల బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాలు నింపాలని, తెలంగాణ ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షించారు. మహిళలు, యువతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా పండుగను జరుపుకోవాలని కోరారు. తెలంగాణ సంప్రదాయాలను, సంస్కృతిని భావితరాలకు అందించేలా బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

వరుణుడే విజేత.. ఐదో టీ20 వాన ఖాతాలోకి

2-2తో సిరీస్ పంచుకున్న భారత్, విండీస్

బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో శనివారం రాత్రి జరిగిన ఐదో, చివరి టీ20లో వర్షం కారణంగా ఫలితం తేలలేదు. ఫలితంగా ఇరు జట్లూ 2-2తో సిరీస్‌ను పంచుకున్నాయి. వర్షం, ఆపై మైదానం తడిగా ఉండటంతో అంపైర్లు 9 ఓవర్ల చొప్పున మ్యాచ్‌ను ప్రారంభించారు. కానీ, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 7.4 ఓవర్లలో 118/5 స్కోరుతో జోరు మీద ఉన్న సమయంలో మళ్లీ వాన రావడంతో ఆట రద్దయింది. అప్పటికి ఇషాన్ కిషన్ (10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 30), నమన్ ధీర్ (6 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 24 నాటౌట్) ధనాధన్ షాట్లతో అలరించి సిరీస్ విజయంపై రేపిన ఆశలపై వరుణుడు నీళ్లు చల్లాడు.



పోలీసు ఉత్తమ సేవా పతకం అందుకున్న సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి

(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు

సూర్యాపేట జిల్లా ప్రతినిధి) అక్టోబర్ 17

డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్ చేతుల మీదుగా పతకం అందజేత -- అభినందనలు తెలిపిన జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్రా ష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు--2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారాల్లో సూర్యాపేట జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డికి పోలీసు ఉత్తమ సేవా పతకం లభించింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ శ్రీ సీవీ ఆనంద్ ఐపీఎస్ గారు డీజీపీ కార్యాలయంలో రవీందర్ రెడ్డికి పతకాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సూర్యాపేట జిల్లా ఎస్పీ శ్రీ కె. నరసింహ ఐపీఎస్ గారు అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డిని అభినందించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలంగా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు విలువైన సేవలు అందించారని, విధి నిర్వహణలో చూపిన అంకితభావం, కృషి అభినందనీయమని కొనియాడారు.

సుదీర్ఘ పోలీసు సేవలకు గుర్తింపు..

అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి 1992 సంవత్సరంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీసు శాఖలో నియామకమై, పెద్దకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో తొలి పోస్టింగ్‌లో విధులు నిర్వహించారు. అనంతరం 2007లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఎస్ఐ, సీఐ హోదాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సేవలందించారు. 2017లో డీఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం సీఐడీ విభాగంలో విధులు నిర్వహించారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది వికారాబాద్ జిల్లాలో అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ డీసీపీగా, నిజామాబాద్‌లో, సికింద్రాబాద్ రైల్వే విభాగంలోనూ వివిధ హోదాల్లో సేవలందించారు. పోలీసు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అందించిన సేవలకు గుర్తింపుగా ఆయనకు పోలీసు ఉత్తమ సేవా పతకం లభించడం పట్ల సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ హర్షం వ్యక్తం చేసింది. పోలీసు శాఖకు గౌరవం తీసుకొచ్చిన అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డికి జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ గారు మరోసారి అభినందనలు తెలిపారు.

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, బతుకమ్మ ఏర్పాట్ల పనులు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నానని వెల్లడి

హుస్నాబాద్ అక్టోబర్ 17 రవీందర్ ప్రజా తీర్పు



నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం హుస్నాబాద్ కు విచ్చేసిన సందర్భంగా మంత్రి ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ పండుగ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మహిళలకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్లాస్ బ్రిడ్జి, కప్పగుట్ట పర్యాటక అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్క్ ఏర్పాటు వంటి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎల్లమ్మ చెరువుతో పాటు కొత్త చెరువు, పల్లె చెరువులను కూడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. హుస్నాబాద్‌ను క్రీడారంగంలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కబడ్డీ అకాడమీని మంజూరు చేశామని తెలిపారు. హుస్నాబాద్‌లో స్టేడియం ఏర్పాటు చేయాల్సి ఉందని, నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. మల్లెచెట్టు చౌరస్తా నుంచి రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కోహెడలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్,చిగురుమామిడిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఎల్కతుర్తిలో ఐఐఐటీ బ్రాంచ్, వంగరలో నవోదయ పాఠశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, సైదాపూర్‌కు మరో పబ్లిక్ స్కూల్ మంజూరు కానుందని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని,ప్రాజెక్టు కాలువలకు సంబంధించిన భూసేకరణ పనులు కొనసాగుతున్నాయని, భూసేకరణ పూర్తయిన వెంటనే కాలువల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఎంఎంఆర్ ప్యాకేజీ కింద కూడా పనులు ప్రారంభమవుతాయని,సాగునీటికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంటలు ఎండిపోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని, పంట పూర్తయ్యే వరకు రాత్రి వేళల్లో కూడా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ప్రస్తుత నీటి నిల్వలను వచ్చే వేసవిలో తాగునీటి అవసరాలకు కూడా వినియోగించుకోవాల్సి ఉందని, అందువల్ల నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని, ఈ సీజన్‌లో వరి సాగును వాయిదా వేసే అంశాన్ని పరిశీలించాలని రైతులను కోరారు.ప్రకృతి వైపరీత్యాలు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని, ఈ అంశాలపై కేబినెట్‌లో కూడా చర్చించినట్లు తెలిపారు. ఈ సమయంలో రాజకీయాలకు అతీతంగా రైతులకు అండగా నిలవాలని అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేశారు. ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచుకోవాలని ప్రజలకు సూచిస్తున్నామని చెప్పారు. ఒక్క ఏడాదిలోనే 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని, హుస్నాబాద్ పట్టణంలో 500 ఇళ్లు కేటాయించామని తెలిపారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చామని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఎక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, ఆక్రమణలపై ప్రజలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా ప్రజల సమస్యలను విజ్ఞాపనల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజాప్రతినిధులందరూ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, ఆర్డీవో రామ్మూర్తి, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020